ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 2, అక్టోబరు 2025

రేపటి నుంచి నూతన టీచర్లకు శిక్షణ 2



కమనీయం.. కళారాల ఉత్సవం

ఒంగోలు నడిబొడ్డు భక్తజన సంద్రమైంది. నగరం దేవీ నామస్మరణతో మార్మోగింది. దసరా సందర్భంగా ఏటా నిర్వహించే కళారాల ఉత్సవం రెండో రోజైన బుధవారం కూడా కొనసాగింది. నగరంలోని గంటాపాలెం నుంచి శ్రీపార్వతీదేవి, బీవీఎస్ హాల్ సెంటర్ నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి, కేశవస్వామిపేట నుంచి శ్రీ మహిషాసురమర్దిని కళారాల ఊరేగింపులు భక్తుల జయజయధ్వానాల మధ్య కమనీయంగా సాగాయి. ఈ సందర్భంగా కళాకారుల వేషధారణలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గురువారం వేకువజామున మూడు కళారాలు మస్తాన్‌దర్గా సెంటర్‌కు చేరుకున్నాయి. వేలాదిగా భక్తులు తరలివచ్చి తిలకించి పులకించిపోయారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్

వెలిగొండ ఫీడర్ కాలువకు టెండర్లు

- రూ.370 కోట్లతో లైనింగ్, కాంక్రీటు గోడల నిర్మాణం
- ఈనెల 15వరకు గడువు
- నెలాఖరు లోపు అగ్రిమెంట్!
- ప్రాజెక్టు కీలక పనుల్లో మరో ముందడుగు

2



వర్షాలకు దెబ్బతిన్న ఫీడర్ కాలువ(ఫైల్)



మద్దిపాడులో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్. పక్కన మంత్రి స్వామి

పండుగలా పింఛన్‌ల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి అందజేత
- నోటీసులు ఇచ్చిన వారికి కూడా..
- మద్దిపాడులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్, ఎమ్మెల్యే బీఎన్
- తగ్గించిన జీఎస్టీపై పలుచోట్ల అవగాహన

2లో

పొగాకు ధరలు పతనం

- సాగుదారుల్లో ఆందోళన
- వారంలో కిలోకు రూ.15నుంచి రూ.20కి తగ్గిన గరిష్ఠ ధరలు
- కొండపిలో రైతుల నిరసన
- ఒంగోలులో వేలాన్ని పరిశీలించిన ఈడీ

2

ఫీడర్ కాలువకు టెండర్లు

- రూ.370 కోట్లతో లైనింగ్, కాంక్రీటు గోడల నిర్మాణ పనులకు అధికారుల చర్యలు
- ఈనెల 15 వరకు గడువు
- 16న సాంకేతిక, 22న ఆర్థిక బిడ్ల పరిశీలన
- నెలాఖరుకు అగ్రిమెంట్ పూర్తయ్యే అవకాశం
- వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో కీలక అడుగు


వర్షాలకు దెబ్బతిన్న ఫీడర్ కాలువ (ఫైల్)

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ తొలిదశను వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు అధికారులు మరో అడుగు ముందుకు వేశారు. ప్రస్తుతం అత్యంత కీలకంగా భావిస్తున్న ఫీడర్ కెనాల్ ఆధునికీకరణ పనులకు టెండర్లు పిలిచారు. తీవ్ర ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లోనూ వెలిగొండపై సీఎం ప్రత్యేక దృష్టితో నిధులకు భరోసా ఇచ్చిన విషయం విదితమే. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన పనులకు సంబంధించి పేరుకుపోయిన బకాయిల్లో ఇటీవల రూ.344 కోట్లు చెల్లింపులు చేయడంతోపాటు మరో రూ.456 కోట్లను ఫీడర్ కాలువ పనుల కోసం మంజూరు చేశారు. అలా చేసిన వారానికే ఆ పనులకు ప్రాజెక్టు అధికారులు టెండర్లు పిలిచారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కాలువ పనులు చేసేందుకు రూ.370 కోట్లతో బుధవారం టెండర్లు పిలిచారు. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.456 కోట్లు మంజూరు చేయగా 18 శాతం జీఎస్టీ, సీనరేజ్, ఇతరత్రా పోను రూ.370 కోట్లు అవసరంగా అంచనా వేసి ఆ మేరకు టెండర్లను ప్రాజెక్టు ఎస్ఈ అబుత్ అలీ పిలిచారు. ఇందులో ఫీడర్ కాలువ 21.80కి.మీ పొడవునా లైనింగ్ చేస్తారు. కాలువ అడుగు భాగంలో 23 వెడల్పు అలాగే ఇరువైపులా కట్టల లోపలి భాగంలో ఏటవాలుగా ఏడు మీటర్ల వంతున లైనింగ్ చేస్తారు. దోర్నాల మండలంలో కడపరాజుపల్లి వద్ద కాలువకు ఇరువైపులా ఒక్కొక్క వైపు 0.65 కి.మీ వంతున 1.30 కి.మీ, గంటవానిపల్లి వద్ద 2కి.మీ. పెద్దారవీడు మండలం కలుకానిపల్లి వద్ద మరో 2 కి.మీకుపైగా ఒక్కొక్క వైపున కాంక్రీటు గోడలను నిర్మించాలి. ఆ పనులను చేస్తేనే టెన్నెల్ ద్వారా కృష్ణానది నుంచి తీసుకునే నీరు డ్యామ్‌లోకి చేరుతుంది. దీంతో యుద్ధప్రాతిపదికన పనులు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వారం రోజులకే టెండర్లను పిలిచినట్లు ఎస్ఈ చెప్పారు. టెండర్లు దాఖలకు ఈనెల 15 వరకు గడువు ఇచ్చారు. ఆన్‌లైన్‌లోనూ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. టెండర్లు దాఖల గడువు ముగిసిన మరుసటి రోజైన ఈనెల 6న దాఖలు చేసిన కంపెనీల సాంకేతిక బిడ్‌లను అధికారులు పరిశీలన చేయాలని నిర్ణయించారు. సాంకేతికంగా అర్హత పొందిన కంపెనీలకు సంబంధించిన ఆర్థిక బిడ్‌లను ఈనెల 22న పరిశీలించి తక్కువ కోడ్ చేసిన కంపెనీకి పనులు కేటాయిస్తారు. నెలాఖరులోగా అగ్రిమెంట్ కూడా పూర్తిచేసి ఆ వెంటనే పనులు ప్రారంభించే ఆలోచనతో అధికార యంత్రాంగం ఉన్నట్లు సమాచారం.

పండుగలా..

- ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ
- గత నెలలో ఇచ్చిన వారందరికీ అందజేత
- మద్దిపాడులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్
- తగ్గించిన జీఎస్టీపై పలుచోట్ల అవగాహన

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం పడుగలా సాగింది. దసరా పర్వదినం గురువారం కావడంతో తొలిరోజే దాదాపు 90శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రక్రియను సచివాలయ సిబ్బంది చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటలకల్లా 80శాతం మందికి పైగా అందజేశారు. మొత్తం జిల్లాలో 2,84,279 మంది లబ్ధిదారులకు రూ.124.89 కోట్ల మేర పింఛన్ మంజూరైంది. దివ్యాంగుల కేటగిరీలో పలువురు అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించి వారికి ప్రభుత్వం గతంలోనే నోటీసులు ఇచ్చింది. వారిలో కొద్ది మంది మాత్రమే తమకు ఉన్న అర్హతలను సూచిస్తూ తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికులు మిన్నకుండిపోయారు. అయినప్పటికీ ఎవరికీ పింఛన్ నిలిపివేయకుండా గతనెలలో ఇచ్చిన వారందరికీ ఈనెలలో కూడా అందజేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మద్దిపాడులో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో పింఛన్లు పంపిణీ చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పామూరు మండలం చట్టుమడుగులో పింఛన్లు పంపిణీ చేయగా.. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని రెండో వార్డులోనూ, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పట్టణంలోని గణేష్‌నగర్‌లో పాల్గొన్నారు. టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గుడూరు ఎరిక్షన్‌బాబు ఎర్రగొండపాలెంలోని వై.కొత్తపల్లిలో, టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దొనకొండ మండలం గంగదేవిపల్లిలో పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో జీఎస్టీ తగ్గింపుపై జిల్లాలోని పలుచోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

- వారంలో కిలోకు రూ.15నుంచి 20తగ్గిన గరిష్ఠ ధరలు
- కొండపిలో రైతుల నిరసన.. ఆగి సాగిన వేలం
- ఒంగోలు-2లో వేలాన్ని పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ
- పలు సమస్యలను వివరించిన రైతు నాయకులు
- కంపెనీల ప్రతినిధులతో బోర్డు అధికారుల భేటీ


వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు ఈడీ విశ్వశ్రీ

పొగాకు ధరలు పతనం

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ తిరోగమనంలో నడుస్తోంది. కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్న వేళ ధరలు పెరగాల్సిందిపోయి దిగజారుతున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి గరిష్ఠ ధరలను దిగ్గోస్తున్నారు. వారం రోజులుగా సగటున కిలోకు రూ.15నుంచి రూ.20 మేర ధరలు తగ్గించి వేశారు. నెల క్రితం వరకు దక్షిణాదిలో కిలో గరిష్ఠ ధర రూ.280 ఉండగా క్రమంగా తొలుత రూ.300, తర్వాత రూ.330.. అలా వారం క్రితం వరకూ రూ.346కు పెంచి వ్యాపారులు ఇచ్చారు. దీంతో రైతుల్లో కాస్తంత ఉత్సాహం కనిపించింది. అయితే వారంలోనే వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పతనం దిశగా సాగుతున్నాయి. అత్యధిక శాతం మేలు రకం బేళ్లను కిలో రూ.320 నుంచి రూ.325 లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇంకా తగ్గుతాయన్న సంకేతాలను కూడా బయ్యర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై బుధవారం కొండపి వేలం కేంద్రంలో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు.

కొనుగోళ్లను పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ

పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ బుధవారం ఒంగోలు-2 వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో కొంతసేపు సమావేశమయ్యారు. దిగజారుతున్న గరిష్ఠ ధరల విషయాన్ని రైతు ప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు పొగాకు కొనుగోలు చేస్తున్న వివిధ కంపెనీల బయ్యర్లతో స్థానిక ఆర్ఎం కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. బోర్డు ఆక్షన్ మేనేజర్ రామాంజనేయులు, ఒంగోలు ఆర్ఎం రామారావు తదితరులు పాల్గొని వేలం ప్రక్రియకు ఆటంకం కలగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు.

రేపటి నుంచి కొత్త టీచర్లకు శిక్షణ

- 9,10 తేదీల్లో వెబ్ కౌన్సెలింగ్
- 661 మందికి శిక్షణ

ఒంగోలు విద్య, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన 661 మందికి జిల్లాస్థాయి ప్రాథమిక శిక్షణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. వారికి ప్రభుత్వం ఇప్పటికే నియామక పత్రాలు జారీ చేసింది. నాలుగు కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు చేశారు. పొదిలిలోని సెయింట్ మేరీ బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ టీచర్లకు, చీరాలలోని చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ పీఎస్, బీఎస్, గణితం టీచర్లకు శిక్షణ ఇస్తారు. చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య, సోషల్ టీచర్లకు, కనిగిరి ఆల్ఫా అగ్రికల్చర్ కళాశాలలో సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. 3నుంచి 10వతేదీ వరకు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. ఈనెల 9,10 తేదీల్లో కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించి పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తారు.

ధర్మవరం వరకు రైలు పొడిగింపు

గిద్దలూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వరకు వెళ్తున్న (17261) నెంబరు రైలును తిరుపతి నుంచి ధర్మవరం వరకు 2 నెలలపాటు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయించారు. అక్టోబరు 1 నుంచి నవంబరు 30వ తేదీ వరకు గుంటూరు నుంచి తిరుపతి వరకు వెళ్లే ఈ రైలు ధర్మవరం వరకు వెళ్తుంది. అలాగే అక్టోబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ధర్మవరం నుంచి తిరుపతి మీదుగా గుంటూరుకు ఈ రైలు 19 కోచ్‌లతో వెళ్తుంది. గుంటూరు నుంచి తిరుపతి వరకు పాత సమయాలలోనే ఈ రైలు తిరుగుతుందని, గుంటూరులో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరే ఈ రైలు గిద్దలూరు మీదుగా తిరుపతికి మరుసటి రోజు తెల్లవారుజామున 3.55 గంటలకు చేరి అక్కడి నుంచి పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి, కదిరి మీదుగా ఉదయం 9గంటలకు ధర్మవరం చేరుతుందని అధికారులు ప్రకటించారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ధర్మవరంలో మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి తిరుపతికి 7.15 గంటలకు చేరుతుందని, అక్కడి నుంచి రేణిగుంట, నంద్యాల, గిద్దలూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు గుంటూరు చేరుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



స్వచ్ఛతా హి సేవ సభలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం

- స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సాంఘికసంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం స్థానిక పాత జిల్లాపరిషత్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన సఫాయి మిత్ర సురక్షసివిర్ మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ రాజాబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయుమార్‌లతో కలిసి మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెడుతున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రమంలో ముందుగా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మునిసిపాలిటీల్లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులతో సమానంగా గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ కార్మికులు ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సేవల కోసం ఏ ఆస్పత్రికైనా, ఏ ప్రభుత్వ కార్యాలయానికైనా వెళ్లి గుర్తింపు కార్డుచూపిస్తే వీఐపీలకు ఇచ్చే గౌరవాన్ని పారిశుధ్య కార్మికులకు కూడా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్‌విజయకుమార్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు జీతాల చెల్లింపులో జాప్యంలేకుండా ప్రభుత్వం చూస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రిమ్స్, కిమ్స్, శ్రీరామ్, అస్టర్ రమేష్, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వైద్యులతో పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా క్లాప్‌మిత్రలు 1820 మంది, పారిశుధ్య కార్మికులు 1215 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ఈఎస్ బాలశంకరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

కొత్త టీచర్ల శిక్షణపై సమీక్ష

ఒంగోలు విద్య, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 3నుంచి ప్రారంభం కానున్న కొత్త టీచర్ల శిక్షణపై డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో డీఎస్సీ టీచర్ల పోస్టులకు ఎంపికైన వారు వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణకు హాజరుకావాలని కోరారు. ప్రతి శిక్షణ కేంద్రానికి పర్యవేక్షణకు ఒక ఎంఈవో, ఒక హెచ్‌ఎంను నియమించారు. శిక్షణకు హాజరయ్యే టీచర్లకు ఉదయాన్నే యోగాపై శిక్షణ ఇప్పించాలని, క్రమశిక్షణ కోసం ప్రతి శిక్షణ కేంద్రానికి ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లను నియమించారు. శుక్రవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులతో డీఈవో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

సమస్యల పరిష్కారం కోసం వైద్యుల ధర్నా

- రేపు చలో విజయవాడను విజయవంతం చేయాలని పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమస్యలను పరిష్కరించాలని పలువురు వైద్యాధికారులు డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్‌బాండ్ పదోన్నతులు అమలు చేయాలని తదితర డిమాండ్లతో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పలువురు అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బేసిక్ పే 30శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్ చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద రూ.5వేల అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 3వ తేదీన ఆయా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ఒనారియల్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ సుందర ప్రసాద్, డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రసూల్, డాక్టర్ చైతన్యదీప్ తదితరులు ఉన్నారు.



ధర్నా చేస్తున్న వైద్యులు

మందుబాబులకు పోలీసు ట్రీట్‌మెంట్!

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు
- ఫిర్యాదుల కోసం 112 టోల్‌ఫ్రీ నంబరు


శివారు కాలనీల్లో మద్యం సేవిస్తున్న వారితో శుభ్రం చేయిస్తున్న పోలీసులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంతోపాటు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మందుబాబులకు జిల్లా పోలీసులు ప్రత్యేక ట్రీట్మెంట్ ఇచ్చారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని వారితో పారిశుధ్య పనులు, వారు మద్యం సేవించిన ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలగింపు లాంటి పనులు చేయించారు. బుధవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 1034 మందిపై కేసులు నమోదు చేయగా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 293 ప్రదేశాలను గుర్తించి 265 ప్రదేశాలను శుభ్రం చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ మందు బాబులు అల్లర్లకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మీ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో వీడియో గానీ, ఫొటోలుగానీ తీసి 9121102266 నంబరుకు వాట్సాప్ చేయాలన్నారు. లేని పక్షంలో 112కు కాల్ చేయవచ్చని తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

గనులపై దృష్టి సారించాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు, సీనరేజ్ తదితరాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం గనులు, ఏపీ ఎండీసీ, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, రవాణా, ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని గనుల విస్తీర్ణం, వాటి రకాలు, లభిస్తున్న ఉపాధి, రవాణా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై ఆయా శాఖల అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత ఇదే సయానికి 18 శాతం వృద్ధి ఉన్నట్లు గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వం జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా నిర్దేశించినందున అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 12 స్టాక్ పాయింట్ల యార్డులలో 80వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ డాక్టర్లతో వైద్య సేవలు

- పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాట్లు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు ఆందోళనబాట పట్టడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది. జిల్లాలో 64 పీహెస్‌సీల పరిధిలో 138 మంది వైద్యాధికారులు పనిచేస్తుండగా వారిలో ఐదుగురు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వైద్యాధికారులందరూ సమ్మెబాటలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ముందుగా జిల్లాలో పరిస్థితిని గమనించిన కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఆయా పీహెచ్‌సీలకు ప్రత్యామ్నాయ వైద్యాధికారులను నియమించారు. వారందరూ బుధవారం 50 మంది విధుల్లో చేరాల్సి ఉండగా 42 మంది డాక్టర్లు వైద్య సేవలు అందించారు. ఇప్పటివరకు రోజువారీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు నాలుగువేలకుపైగా ఓపీలు వస్తుండగా బుధవారం కూడా సుమారు 3,500లకుపైగా ఓపీలు వచ్చాయి. మెడికల్ కాలేజీ నుంచి 50 మంది, కమ్యూనిటీ వైద్యశాల నుంచి 20 మంది వైద్యులను నియమించారు. జిల్లాలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల్లో కార్డుదారులకు బుధవారం రేషన్‌పంపిణీ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 1,392 రేషన్‌షాపుల పరిధిలో 6.61 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు బియ్యం, చెక్కర పంపిణీ ప్రారంభమయ్యాయి. కార్డుదారులకు ఆయా రేషన్‌షాపుల ద్వారా ఉదయం, సాయంత్రం సమయంలో కార్డుదారులకు పంపిణీ చేశారు. తొలిరోజు 20శాతం మంది కార్డుదారులు రేషన్ తీసుకున్నట్లు సమాచారం. దసరా పండుగ కావడంతో కొంతమంది కార్డుదారులు వారి స్వగ్రామాలకు వెళ్లడంతో కొంతమేర తీసుకున్నారు. శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ వేగంగా జరిగే అవకాశం ఉంది.

జిల్లా క్షయ నివారణాధికారిగా డాక్టర్ బాలాజీ


జిల్లా క్షయనివారణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాలాజీని సత్కరిస్తున్న ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్షయ నివారణ, లెప్రసీ ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ బాలాజీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న బాలాజీ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ రాజాబాబును, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లుతో పలు అంశాలపై చర్చించారు. క్షయ నియంత్రణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన బాలాజీని ఆ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, అకోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం రాత్రి ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసే విధంగా దృష్టి సారించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం లక్ష్యాలను సాధించేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 80,811 దరఖాస్తులు రాగా అందులో 2,553 దరఖాస్తులు గ్రౌండింగ్ చేయగా 2442 సోలార్ ఇన్సులేషన్ పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

రేపటి నుంచి మూడో విడత రీసర్వే

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 25 మండలాల పరిధిలోని 35 గ్రామాల్లో శుక్రవారం నుంచి మూడో విడత రీసర్వే ప్రారంభిస్తున్నట్లు సర్వేశాఖ ఏడీ గౌస్‌బాషా బుధవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూమి 15,042.86 ఎకరాలు, పట్టాభూమి 50,397.42 ఎకరాలు కలిపి 65,440.48 ఎకరాల భూమిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం 42 సర్వే బృందాలను నియమించినట్లు తెలిపారు. ఒక్కొక్క బృందంలో ఇద్దరు చొప్పున 84 మంది సర్వేయర్లను, 42 రోవర్ల సహాయంతో ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.

అంకుల్.. ఆకలవుతోంది..
మీ ఇంటికి తీసుకెళ్లరా..!

● అభాగ్య చిన్నారులకు 'హెల్ప్' ఆదరణ



ఆశ్రమానికి చేరిన చిన్నారులు

చిన్న వయస్సులోనే రోడ్డు ప్రమాదంలో తల్లిని కోల్పోయి, తండ్రి సంరక్షణ కరువై వీధుల వెంట దిక్కులేనివారిగా, తిండి కూడా లేని చిన్నారులను హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అక్కున చేర్చుకుంది. బుధవారం ఒంగోలు నగరం నుంచి కొత్తపట్నం వెళ్ళే మార్గంలో రోడ్డు పక్కనే నిస్సహాయ స్థితిలో కూర్చుని ఉన్న ఎనిమిది సంవత్సరాల బాలిక, ఏడు సంవత్సరాల బాలుడుని హెల్ప్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.సాగర్ గుర్తించారు. దీంతో వారితో కొద్దిసేపు ముచ్చటించి వారి వివరాలు తెలుసుకున్నారు. అయితే చిన్నారుల చిన్నతనంలోనే తల్లి మరణించగా, తండ్రి తమ ఆలనాపాలన పట్టించుకోడని, ఎప్పుడువస్తాడో.. ఎప్పుడు వెళతాడో తెలియదని చిన్నారులు కన్నీరు పెట్టుకున్నారు. ఇదే సమయంలో చిన్నారులు 'అంకుల్.. మీ ఇంటికి తీసుకెళ్ళి అన్నం పెడతారా? ' అని దీనంగా అడిగిన మాటలు సాగర్ మనసును కదలిచించాయి. దీంతో ఆయన ఈ విషయాన్ని జిల్ల బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళగా చిన్నారులకు విద్యాబుద్ధులతోపాటు మూడు పూటల తిండి లభించే స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు ఆశ్రమంలో చేర్పించారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

ఘనంగా వాసవీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం



అతిథులను సత్కరించిన క్లబ్ సభ్యులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం స్థానిక బాపూజీ గో సంరక్షణ శాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు మాట్లాడుతూ 1961 అక్టోబరు 1న దివంగత కల్యకుంట్ల చంద్రసేనగుప్తా వాసవీ క్లబ్ స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ప్రస్తుతం లక్షమందికి పైగా సభ్యులతో 1500 స్థానిక క్లబ్‌లతో అంతర్జాతీయ స్థాయి క్లబ్‌గా వాసవీ క్లబ్ ఎదిగిందని చెప్పారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షులు రాధా రమణగుప్తా జంధ్యం, కోడూరి శ్రీనివాసులు, మద్దాలి సురేష్, తుమ్మపూడి ఏడుకొండలు, కూరపాటి సుధాకర్, చీదెళ్ల వెంకటప్రసాద్, నేరెళ్ల శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి బియ్యపు సంపత్‌కుమార్, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గిద్దలూరు ఎమ్మెల్యే

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ పి.రాజాబాబును గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి, వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాజాబాబును వారు కలిసి పూల మొక్కలను అందజేసి తమ నియోజకవర్గాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

హృద్యమైన కథలకు ఆదరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అట్టడుగు జీవిత కోణాలను ఆవిష్కరించే కవిత్వం, కథలు, నాటికలు సమాజ వికాసానికి తోడ్పడతాయని, ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ రచించిన బోరచెక్కు, మ్యూజిక్ ఇన్ కథల సంపుటి పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆనందరావు మాట్లాడుతూ సగటు మనిషి జీవిత నేపథ్యాలను ఇండ్ల చంద్రశేఖర్ తన కథలలో ప్రతిబింబించారన్నారు. ప్రరసం అధ్యక్షుడు పొన్నూరు వేంకటశ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువ రచయిత చంద్రశేఖర్ రెండు తెలుగు రాష్ట్రాలలో తనదైన ముద్ర వేసుకొని పాఠకులను ఆకట్టుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నూకతోటి రవికుమార్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, శ్రీరామ కవచం సాగర్, దయానంద, రఫీ పాల్గొన్నారు. అనంతరం పుస్తక రచయిత చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు.



అమ్మవారి కళారం వద్ద భక్తులు



వేడుకల్లో డప్పు కళాకారుల విన్యాసం



అమ్మవారి కళారానికి హారతి ఇస్తున్న భక్తురాలు

కమనీయం..కళారాల ఉత్సవం

● ఎంపీ మాగుంట ప్రత్యేక పూజలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ఒంగోలు నగరానికే తలమానికంగా నిలిచే అమ్మవారి కళారాల ఉత్సవం రెండవ రోజు కూడా అత్యంత ఘనంగా జరిగింది. దసరా పండుగ ముందు రెండు రోజులు అనగా దుర్గాష్టమి, మహర్నవమి రోజులలో ఈ కళారాల ఉత్సవం జరుగుతుంది. మహర్నవమి రోజైన బుధవారం రాత్రి స్థానిక గంటాపాలెం నుంచి శ్రీపార్వతీదేవి అమ్మవారి కళారం, బీవీఎస్ హాల్ సెంటర్ నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి కళారం, కేశవస్వామిపేట నుంచి శ్రీ మహిషాసురమర్దని కళారాలు ఊరేగింపుగా బయల్దేరి నగరంలోని పలు మార్గాల్లో కొనసాగి గురువారం తెల్లవారుజాముకు మస్తాన్‌దర్గా సెంటర్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కళారాలను చూడటానికి వచ్చిన వేలాదిమంది ప్రజానీకం, భక్తులతో నగరంలోని పలు రహదారులు కిక్కిరిసిపోయాయి. అదేవిధంగా కళారాలను యువకులు ఉత్సాహంగా ఊరేగించగా ప్రత్యేక వాహనం ముందు తప్పెట్లు, డీజే వాయిద్యాలు, కళాకారుల వేషధారణలతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళారాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొని ముందుగా అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న కళాకారుల విన్యాసం



అమ్మవారికి నమస్కరిస్తున్న ఎంపీ మాగుంట



ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన



అమ్మవారి కళారంతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు

● ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి పాలనలో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. బుధవారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను స్థానిక 37వ డివిజన్‌లోని శివాజీనగర్‌లో ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా సూపర్ సిక్స్ హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రూ.124 కోట్లు ఎన్టీఆర్ భద్రత పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పింఛన్ల పెంపు, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డీఎస్సీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకాలను అర్హులైన అందరికీ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 4న ఆటో డ్రైవర్‌లకు కూడా ఏడాదికి రూ.15వేలు వంతున అందిస్తామని, ప్రభుత్వం అందించే పథకాలు ప్రతి కుటుంబానికి ఆసరాగా నిలుస్తాయని ఆయన తెలిపారు. త్వరలోనే కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత కూటమి పాలనదే అన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు మేడికొండ మోహన్‌రావు, నగర అధ్యక్షుడు బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, బెజవాడ మురళీ, నిడమనూరి పావని తదితరులు పాల్గొన్నారు.



పింఛను నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

టీడీపీ నాయకుడికి నివాళి

నాగులుప్పలపాడు, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): ఉప్పుగుండూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గోగినేని అంజనేయులు దశదిన కర్మ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, ఒంగో లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ ఎంపీ కరణం బలరాం విచ్చేసి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అడకా స్వాములు, తేళ్ల మనోజ్‌కుమార్, కనగాల శ్రీనివాసరావు, కాట్రగడ్డ చంద్రబాబు, సెల్వం, బెల్లం శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



కరపత్రాలను అందజేస్తున్న అధికారులు

కొత్తపట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించే దిశగా అధికారులు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. మండలంలోని రంగాయపాలెం, గమండ్లపాలెం, రాజుపాలెం, ఈతముక్కల గ్రామాల్లో జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి సువార్త, ఎంపీడీవో శేషుబాబు, ఈవోఆర్డీ మూర్తి తదితరులు జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా అధికారులు గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సువార్త మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల గృహవినియోగ వస్తువులు అన్నింటి పై ధరలు తగ్గుతాయన్నారు. దీంతో పాటు పలు గ్రామాల్లో పారిశుధ్య పనులను కూడా అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అల్లయ్య, బాలాజీ, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు: నూతన జీఎస్టీ ద్వారా ఒనగూరే ప్రయోజనాలపై బుధవారం పొన్నలూరులో వ్యాపారులు, ప్రజలకు మండల ప్రత్యేకాధికారి డి.వరలక్ష్మి అవగాహన కల్పించారు. ధరల తగ్గుదలపై దుకాణాల వద్ద ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో పి.సుజాత, కార్యదర్శి ఎం.నారాయణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

అంబపరమేశ్వరి పాలయమాం!

మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనం ● పలు దేవాలయాల్లో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల పూజలు



కొత్తపట్నం బస్టాండు వద్ద మహిషాసురమర్దినిగా పార్వతీదేవి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న మంగమూరుడొంక గాయత్రీ అమ్మవారు



విజయదుర్గ అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులలో ముఖ్యమైనవిగా భావించే మూడు రోజులలో ఒకటైన మహర్నవమి రోజు అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహర్నవమి పండుగను బుధవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని పలు అమ్మవారి దేవాలయాలలో అమ్మవారికి మహిషాసురమర్దని అవతారంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఒంగోలు నగరంలో సైతం పలు దేవాలయాలలో అమ్మవారు మహిషాసురమర్దనిగా భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు, మహిళలు పలు దేవాలయాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నగరంలోని కేశవస్వామిపేట శ్రీవిజయదుర్గాదేవి దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీకనకదుర్గ, పోలేరమ్మ, మహాలక్ష్మి దేవస్థానాలు, గంటాపాలెం శ్రీపార్వతమ్మ దేవస్థానం, అంకమ్మపాలెం కాళికా అమ్మవారి దేవస్థానం, మంగమూరురోడ్డు శ్రీగాయత్రిమందిరం, శ్రీఅచలానంద ఆశ్రమం, లాయర్‌పేట, సంతపేట సాయిబాబా మందిరాలలోని శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయం, నాగలక్ష్మి అమ్మవారి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం, కొత్తపట్నంరోడ్డు శ్రీలక్ష్మీనరసింహస్వామి, బాలాత్రిపురసుందరీ దేవస్థానం మొదలైన పలు దేవాలయాలలో అమ్మవారిని మహిషాసురమర్దనిగా విశేష అలంకరణలు చేసి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఇక ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నగరంలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొనగా ఆయనకు దేవస్థానాల ఈవోలు, నిర్వాహకులు, అర్చకులు, స్థానిక నాయకులు సాదరస్వాగతం పలికారు.

మహిషాసురమర్దినిగా జాలమ్మతల్లి

సింగరాయకొండ: సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఉన్న జాలమ్మతల్లి దేవస్థానంలో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో, సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని కోటమ్మతల్లి ఆలయంలో అమ్మవార్లకు విశిష్ట పూజలు చేశారు.

పల్లామల్లిలో వైభవంగా మహర్నవమి



చీమకుర్తిలో పూజలు చేస్తున్న భక్తులు

చీమకుర్తి: దసరా శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి తొమ్మిదోరోజైన మహర్నవమి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పల్లామల్లి కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అమ్మవారి ప్రతిమను మహిషాసురమర్దిని రూపంలో అలంకరించి విశేషపూజలు జరిపారు. మహిళలు, భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. పూజారి శ్రీనివాస శర్మ పూజా క్రతువులు నిర్వహించారు.

పన్ను తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి స్వామి



జీఎస్టీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు, అధికారులు

మద్దిపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు ఫలాలు ప్రజలకు అందాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సులో కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌లతో కలిసి కిరాణా షాపులను సందర్శించారు. జీఎస్టీ 2.0లో భాగంగా వస్తుసేవల పన్ను తగ్గింపు విధానాన్ని పరిశీలించారు. అనంతరం చేపట్టిన ట్రాక్టర్స్ ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఇక బీసీకాలనీలో ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ 5 స్లాబులుగా ఉండే జీఎస్టీని 2 స్లాబులకు తగ్గించారని చెప్పారు. దీనివల్ల రాష్ట్రానికి సుమారు రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గుతున్నప్పటికీ, ప్రతి కుటుంబానికి నెలవారీ ఖర్చులో 10 నుంచి 15 శాతం ఆదా అవుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా పించన్ల కోసం రూ.2700 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మద్దిపాడు మండలంలో 7931మందికి రూ.3,34,88,500 ఇస్తుండగా మద్దిపాడులో 659 మందికి పించన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నా తల్లికివందనం పథకం కింద ఒక్కొక్కరికీ రూ.15 వేలు, అన్నదాత సుఖీభవతో రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో జతఎస్టీని రెండు స్లాబులకు తగ్గించారని, దీనివల్ల అనేక రకాల వస్తువుల ధరలు తగ్గినట్లు చెప్పారు. దీనిపై క్షేత్రస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపు కలిగే లబ్ధిని కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ శ్రీసత్యప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వరరావు, ఆర్డీవో కళావతి, ఏడీవో శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు, టీడీపీ కో ఆర్డినేటర్ మండవ జయంత్ బాబు, మండవ గోపీనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మందపల్లి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, రావిపాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అన్నమనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలి

● బోర్డు ఈడీ విశ్వశ్రీ



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ, పక్కన వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు రూరల్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): వేలం కేంద్రాలలో పొగాకును ఈనెలాఖరులోపు కొనుగోలు పూర్తి చేయాలని బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ ఆదేశించారు. బుధవారం ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో జరిగిన పొగాకు వేలాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో ఈనెల 8వ తేదీ నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని, అందువలల్ల ఈనెల చివరిలోపు జిల్లాలో పొగాకు వేలం ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులు కూడా బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే పొగాకు పంటసాగు చేయాలని, అంతకుమించి ఎలాంటి పరిస్థితిలో అధికంగా సాగు చేయవద్దని చెప్పారు. ఇంకా ఇక్కడి వేలంకేంద్రం పరిధిలో ఎంత పొగాకు నిల్వ ఉన్నదనే విషయాన్ని వేలం నిర్వహణాధికారి జె.తులసిని ఆమె అడిగారు. సుమారుగా ఒక మిలియన్ కిలోల హైగ్రేడ్, రెండు మిలియన్‌ల కిలోల లోగ్రేడ్ పొగాకు ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే ప్రతి రోజు పొగాకు బేళ్లు ఎక్కువగా వేలానికి తెప్పించి ఈనెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కొంత మంది రైతులు మాట్లాడుతూ రెండు పొయ్యిలు గల బ్యారన్‌లను ఒక బ్యారన్‌గా నమోదు చేశారని, బ్యారన్‌ల లీజులు అవసరమైతే సంవత్సరం తరువాత కూడా మార్పులకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం పొగాకు గూడెంను ఈడీ పరిశీలించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రామాంజనేయులు, ఆర్ఎం రామారావు, బోర్డు సభ్యుడు పోద వరప్రసాద్, రైతు నాయకులు వడ్డెళ్ల ప్రసాద్, పెనుబోతు సునీల్, వై.వెంకటశేషయ్య, అబ్బూరి శేషగిరి, రావి మహేష్, దేవబత్తిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు : ఎస్ఐ

సంతనూతలపాడు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా బహిరంగంగా మద్యపానం చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అజయ్‌బాబు హెచ్చరించారు. మండలంలో ఎక్కడా కూడా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చేయకూడదని ఆయన తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ తన సిబ్బందితో సంతనూతలపాడులోని ఎన్ఎస్పీకాలనీ సమీపంలో ఆరుబయట మద్యం తాగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను పోలీసు సిబ్బందితో శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు.

రేపు ఇలవరలో రీసర్వే గ్రామసభ

కొండపి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇలవర గ్రామంలో మూడో దశ రీసర్వే గ్రామసభ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని గ్రామస్థుల ద్వారా తెలుసుకొని రీసర్వే చేపడతామన్నారు. ప్రజలంతా సభకు హాజరు కావాలని కోరారు.

కొండపిలో ఆగి సాగిన పొగాకు వేలం

● మేలు రకానికి ధరలు తగ్గాయని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొండపి కేంద్రంలో పొగాకు వేలం ఆగి సాగింది. తొలుత రైతులు కొనుగోళ్లను అడ్డుకున్నారు. వేలం నిర్వహణాధికారితో చర్చల అనంతరం తిరిగి ప్రారంభించారు. బుధవారం నెన్నూరుపాడు, గుర్రప్పడియ, మూగ చింతల, చతుకుపాడు, అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి బేళ్లను తీసుకువచ్చారు. వాటిలో ఎఫ్-1 అధికంగా ఉన్నాయి. ప్రధానంగా పొగాకు కొనుగోలు చేసే మూడు కంపెనీలు కిలో రూ.260 నుంచి రూ.280 మధ్య అధిక బేళ్లను కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆగ్రహించారు. దాదాపు 300 బేళ్ల కొనుగోలు అనంతరం వేలాన్ని అడ్డుకున్నారు. మేలు రకం పొగాకును నిన్నటి వరకు కిలో రూ.345కు కొనుగోలు చేసి ఇప్పుడు ధరలు దిగ్గోయడమేంటని మండిపడ్డారు. రెండు గంటల తర్వాత వేలం నిర్వహణాధికారితో చర్చించారు. అనంతరం వేలాన్ని కొనసాగించి పూర్తి చేశారు. అయినప్పటికీ ధరల్లో మార్పు రాలేదని పలువురు రైతులు వాపోయారు.

కోలాహలంగా పింఛన్ల పంపిణీ



వృద్ధులను సన్మానిస్తున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ బుధవారం కోలాహలంగా జరిగింది. అధికారులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఉదయం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను నగదును అందజేశారు. ఎంపీడీవో రవికుమార్ ఈదుమూడి, నాగులుప్పలపాడు, చేకూరపాడు, మద్దిరాలపాడు, ఒమ్మెవరం, కండ్లగుంట, రాపర్ల తదితర గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.

వృద్ధులకు సత్కారం

వృద్ధుల దినోత్సవాన్ని నాగులుప్పలపాడులో ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో పలువురు వృద్ధులను శాలువా కప్పి సన్మానించారు. పండ్లు అందజేశారు. అనంతరం గ్రామంలో జీఎస్టీ 2.0 పై ఇంటింటి ప్రచారం నిర్వహించి అవగాహన పత్రాలు అందజేశారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ సూపర్‌వైజర్ టి.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి అట్లూరి శరత్, విజయకుమార్, ఏపీవో రవిబాబు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం మేరా యువభారత్ సహకారంతో డి సెవెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవుడుచెరువులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేదిక ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ షేక్ సిద్దాంబి ముఖ్యఅతిథిగా పాల్గొని వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని వృద్ధులను గౌరవించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి మంచి చెడ్డలు చూడాల్సిన అవసరం కుటుంబసభ్యులు, స్వచ్ఛంద సంస్థలపై ఉందన్నారు. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.గురవారెడ్డి మాట్లాడుతూ వృద్ధాప్యాన్ని ఆనందంగా గడిపేవిధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జిల్లా గ్రంధాలయ సంస్థ ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి మాట్లాడుతూ వృద్ధులను గౌరవించాలని కోరారు. 50 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ జరిగింది.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

● 10సవర్ల బంగారం, రూ.9వేల నగదు అపహరణ

ఒంగోలు క్రైం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగలు చేతివాటం చూపారు. బుధవారం మధ్యాహ్నం ఇరువురు మహిళా ప్రయాణీకుల వద్ద బంగారం, నగదును అపహరించారు. వివరాల్లోకి వెళితే.. సర్వేరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పోకూరి సుమతి పర్చూరు వెళ్ళేందుకు ఒంగోలులోని ఆర్టీసి బస్టాండ్‌లో ఇంకొల్లు వైపు వెళ్లే బస్సు ఎక్కారు. ఆ సమయంలో ఆమె చేతి సంచిలోని 10 సవర్ల బంగారపు నగలు దొంగలు అపహరించారు. అదే విధంగా కొత్తపట్నం మండలం ఆలూరుకు చెందిన కనపర్తి సువార్తమ్మ కూడా అదే బస్సు ఎక్కుతుండగా ఆమె బ్యాగ్‌లో ఉన్న రూ.9 వేల నగదును దొంగలు దోచేశారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి పాలనలో అరాచకాలు

● వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి వైసీపీ శ్రేణులపై ఆరాచకాలు చేయడంతో పాటు అక్రమకేసులను బనాయించి వేధింపులకు పాల్పడుతోందని వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు ఆరోపించారు. బుధవారం ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నుంచి తమ పార్టీ కార్యకర్తలను కాపాడుకునే దిశగా అధిష్ఠానం చర్యలు తీసుకుటుందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతంచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు మెరుగ నాగార్జున, అన్నా రాంబాబు, కేపీ.నాగార్జున, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ, కదిరి బాబురావు, కసుకుర్తి అదెన్న, నాయకులు జూపూడి ప్రభాకర్, కొమ్మూరి కనకారావు, కాకుమాను రాజశేఖర్, పుత్తా శివశంకర్‌రెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కేవీ.రమణారెడ్డి, బొట్లా రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ హర్షవర్ధన్‌రాజును మర్యాదపూర్వంగా వారు కలిశారు.

మహిళలకు వైద్య పరీక్షలు

ఒంగోలు రూరల్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని కిమ్స్ వైద్యశాల డాక్టర్ రామాంజనేయులు పేర్కొన్నారు. ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయలు మాట్లాడుతూ మహిళలు ముందస్తుగా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్, బీపీ, షుగర్ లాంటి జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ అయితే తగిన వైద్య సహాయం పొందాలన్నారు. డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, సర్పంచ్ ఎన్.వెంకటేశ్వరరావు, కరవది సొసైటీ అధ్యక్షుడు ముప్పవరపు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

4న రౌండ్ టేబుల్ సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం తరహాలో జనగణనలో కులగణన కోరుతూ ఈనెల 4వతేదీన ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో 143వెనుకబడిన కులాలు ఉన్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వల్ల వేల సంఖ్యలో స్థానికసంస్థలకు చెందిన పదవులను బీసీలు కోల్పోయరన్నారు. అందువల్ల కులగణన చేపట్టిన వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగుపరచాలి

ఒంగోలు రూరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగుపరచాలని సీపీఎం కేంద్రకమిటీ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. ఒంగోలు నగరం గాంధీనగర్‌లోని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో రెగ్యులర్ డాక్టర్లను నియమించాలని డిమాడ్ చేశారు. కార్యక్రమంలో కంకణాల రమాదేవి, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, సయ్యద్ హుసేన్ పాల్గొన్నారు.

మైనంపాడులో పింఛన్‌ల పంపిణీ

సంతనూతలపాడు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మైనంపాడు గ్రామంలో పింఛన్లను బుధవారం అధికారులు, టీడీపీ నాయకులు కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఎంపీడీవో బి.ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు ఆళ్ళ రంగయ్య, తెలుగుయువత అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, నాయకులు అవినాష్ చౌదరి, బ్రహ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


పింఛన్‌పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఆంధ్రజ్యోతి

1

ప్రకాశం
జిల్లా వార్తలు

గురువారం 2, అక్టోబరు 2025

రేపటి నుంచి నూతన టీచర్లకు శిక్షణ 2



కమనీయం.. కళారాల ఉత్సవం

ఒంగోలు నడిబొడ్డు భక్తజన సంద్రమైంది. నగరం దేవీ నామస్మరణతో మార్మోగింది. దసరా సందర్భంగా ఏటా నిర్వహించే కళారాల ఉత్సవం రెండో రోజైన బుధవారం కూడా కొనసాగింది. నగరంలోని గంటాపాలెం నుంచి శ్రీపార్వతీదేవి, బీవీఎస్ హాల్ సెంటర్ నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి, కేశవస్వామిపేట నుంచి శ్రీ మహిషాసురమర్దిని కళారాల ఊరేగింపులు భక్తుల జయజయధ్వానాల మధ్య కమనీయంగా సాగాయి. ఈ సందర్భంగా కళాకారుల వేషధారణలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గురువారం వేకువజామున మూడు కళారాలు మస్తాన్‌దర్గా సెంటర్‌కు చేరుకున్నాయి. వేలాదిగా భక్తులు తరలివచ్చి తిలకించి పులకించిపోయారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్

వెలిగొండ ఫీడర్ కాలువకు టెండర్లు

- రూ.370 కోట్లతో లైనింగ్, కాంక్రీటు గోడల నిర్మాణం
- ఈనెల 15వరకు గడువు
- నెలాఖరు లోపు అగ్రిమెంట్!
- ప్రాజెక్టు కీలక పనుల్లో మరో ముందడుగు

2



వర్షాలకు దెబ్బతిన్న ఫీడర్ కాలువ(ఫైల్)



మద్దిపాడులో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్. పక్కన మంత్రి స్వామి

పండుగలా పింఛన్‌ల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి అందజేత
- నోటీసులు ఇచ్చిన వారికి కూడా..
- మద్దిపాడులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్, ఎమ్మెల్యే బీఎన్
- తగ్గించిన జీఎస్టీపై పలుచోట్ల అవగాహన

2 లో

పొగాకు ధరలు పతనం

- సాగుదారుల్లో ఆందోళన
- వారంలో కిలోకు రూ.15నుంచి రూ.20కి తగ్గిన గరిష్ఠ ధరలు
- కొండపిలో రైతుల నిరసన
- ఒంగోలులో వేలాన్ని పరిశీలించిన ఈడీ

2

ఫీడర్ కాలువకు టెండర్లు

- రూ.370 కోట్లతో లైనింగ్, కాంక్రీటు గోడల నిర్మాణ పనులకు అధికారుల చర్యలు
- ఈనెల 15 వరకు గడువు
- 16న సాంకేతిక, 22న ఆర్థిక బిడ్‌ల పరిశీలన
- నెలాఖరుకు అగ్రిమెంట్ పూర్తయ్యే అవకాశం
- వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో కీలక అడుగు



వర్షాలకు దెబ్బతిన్న ఫీడర్ కాలువ (ఫైల్)

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ తొలిదశను వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు అధికారులు మరో అడుగు ముందుకు వేశారు. ప్రస్తుతం అత్యంత కీలకంగా భావిస్తున్న ఫీడర్ కెనాల్ ఆధునికీకరణ పనులకు టెండర్లు పిలిచారు. తీవ్ర ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లోనూ వెలిగొండపై సీఎం ప్రత్యేక దృష్టితో నిధులకు భరోసా ఇచ్చిన విషయం విదితమే. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన పనులకు సంబంధించి పేరుకుపోయిన బకాయిల్లో ఇటీవల రూ.344 కోట్లు చెల్లింపులు చేయడంతోపాటు మరో రూ.456 కోట్లను ఫీడర్ కాలువ పనుల కోసం మంజూరు చేశారు. అలా చేసిన వారానికే ఆ పనులకు ప్రాజెక్టు అధికారులు టెండర్లు పిలిచారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కాలువ పనులు చేసేందుకు రూ.370 కోట్లతో బుధవారం టెండర్లు పిలిచారు. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.456 కోట్లు మంజూరు చేయగా 18 శాతం జీఎస్టీ, సీనరేజ్, ఇతరత్రా పోను రూ.370 కోట్లు అవసరంగా అంచనా వేసి ఆ మేరకు టెండర్లను ప్రాజెక్టు ఎస్ఈ అబుత్ అలీ పిలిచారు. ఇందులో ఫీడర్ కాలువ 21.80కి.మీ పొడవునా లైనింగ్ చేస్తారు. కాలువ అడుగు భాగంలో 23 వెడల్పు అలాగే ఇరువైపులా కట్టల లోపలి భాగంలో ఏటవాలుగా ఏడు మీటర్ల వంతున లైనింగ్ చేస్తారు. దోర్నాల మండలంలో కడపరాజుపల్లి వద్ద కాలువకు ఇరువైపులా ఒక్కొక్క వైపు 0.65 కి.మీ వంతున 1.30 కి.మీ, గంటవానిపల్లి వద్ద 2కి.మీ. పెద్దారవీడు మండలం కలుకానిపల్లి వద్ద మరో 2 కి.మీకుపైగా ఒక్కొక్క వైపున కాంక్రీటు గోడలను నిర్మించాలి. ఆ పనులను చేస్తేనే టన్నెల్ ద్వారా కృష్ణానది నుంచి తీసుకునే నీరు డ్యామ్‌లోకి చేరుతుంది. దీంతో యుద్ధప్రాతిపదికన పనులు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వారం రోజులకే టెండర్లను పిలిచినట్లు ఎస్ఈ చెప్పారు. టెండర్లు దాఖలకు ఈనెల 15 వరకు గడువు ఇచ్చారు. ఆన్‌లైన్‌లోనూ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. టెండర్లు దాఖల గడువు ముగిసిన మరుసటి రోజైన ఈనెల 6న దాఖలు చేసిన కంపెనీల సాంకేతిక బిడ్‌లను అధికారులు పరిశీలన చేయాలని నిర్ణయించారు. సాంకేతికంగా అర్హత పొందిన కంపెనీలకు సంబంధించిన ఆర్థిక బిడ్‌లను ఈనెల 22న పరిశీలించి తక్కువ కోడ్ చేసిన కంపెనీకి పనులు కేటాయిస్తారు. నెలాఖరులోగా అగ్రిమెంట్ కూడా పూర్తిచేసి ఆ వెంటనే పనులు ప్రారంభించే ఆలోచనతో అధికార యంత్రాంగం ఉన్నట్లు సమాచారం.

పండుగలా..

ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ

గత నెలలో ఇచ్చిన వారందరికీ అందజేత

మద్దిపాడులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్

తగ్గించిన జీఎస్టీపై పలుచోట్ల అవగాహన

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సామాజిక పింఛన్‌ల పంపిణీ బుధవారం పడుగలా సాగింది. దసరా పర్వదినం గురువారం కావడంతో తొలిరోజే దాదాపు 90శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రక్రియను సచివాలయ సిబ్బంది చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటలకల్లా 80శాతం మందికి పైగా అందజేశారు. మొత్తం జిల్లాలో 2,84,279 మంది లబ్ధిదారులకు రూ.124.89 కోట్ల మేర పింఛన్ మంజూరైంది. దివ్యాంగుల కేటగిరీలో పలువురు అనర్హులు పింఛన్‌లు పొందుతున్నట్లు గుర్తించి వారికి ప్రభుత్వం గతంలోనే నోటీసులు ఇచ్చింది. వారిలో కొద్ది మంది మాత్రమే తమకు ఉన్న అర్హతలను సూచిస్తూ తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికులు మిన్నకుండిపోయారు. అయినప్పటికీ ఎవరికీ పింఛన్ నిలిపివేయకుండా గతనెలలో ఇచ్చిన వారందరికీ ఈనెలలో కూడా అందజేశారు. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మద్దిపాడులో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో పింఛన్‌లు పంపిణీ చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ మక్కు. ఉగ్ర నరసింహారెడ్డి పామూరు మండలం చట్టుమడుగులో పింఛన్‌లు పంపిణీ చేయగా.. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని రెండో వార్డులోనూ, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పట్టణంలోని గణేష్‌నగర్‌లో పాల్గొన్నారు. టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గుడూరు ఎరిక్షన్‌బాబు ఎర్రగొండపాలెంలోని వై.కొత్తపల్లిలో, టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దొనకొండ మండలం గంగదేవిపల్లిలో పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో జీఎస్టీ తగ్గింపుపై జిల్లాలోని పలుచోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

వారంలో కిలోకు రూ.15నుంచి 20తగ్గిన గరిష్ఠ ధరలు

కొండపిలో రైతుల నిరసన.. ఆగి సాగిన వేలం

ఒంగోలు-2లో వేలాన్ని పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ

పలు సమస్యలను వివరించిన రైతు నాయకులు

కంపెనీల ప్రతినిధులతో బోర్డు అధికారుల భేటీ



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు ఈడీ విశ్వశ్రీ

పొగాకు ధరలు పతనం

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ తిరోగమనంలో నడుస్తోంది. కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్న వేళ ధరలు పెరగాల్సిందిపోయి దిగజారుతున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి గరిష్ఠ ధరలను దిగ్గోస్తున్నారు. వారం రోజులుగా సగటున కిలోకు రూ.15నుంచి రూ.20 మేర ధరలు తగ్గించి వేశారు. నెల క్రితం వరకు దక్షిణాదిలో కిలో గరిష్ఠ ధర రూ.280 ఉండగా క్రమంగా తొలుత రూ.300, తర్వాత రూ.330.. అలా వారం క్రితం వరకూ రూ.346కు పెంచి వ్యాపారులు ఇచ్చారు. దీంతో రైతుల్లో కాస్తంత ఉత్సాహం కనిపించింది. అయితే వారంలోనే వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పతనం దిశగా సాగుతున్నాయి. అత్యధిక శాతం మేలు రకం బేళ్లను కిలో రూ.320 నుంచి రూ.325 లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇంకా తగ్గుతాయన్న సంకేతాలను కూడా బయ్యర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై బుధవారం కొండపి వేలం కేంద్రంలో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు.

కొనుగోళ్లను పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ

పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ బుధవారం ఒంగోలు-2 వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో కొంతసేపు సమావేశమయ్యారు. దిగజారుతున్న గరిష్ఠ ధరల విషయాన్ని రైతు ప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు పొగాకు కొనుగోలు చేస్తున్న వివిధ కంపెనీల బయ్యర్లతో స్థానిక ఆర్ఎం కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. బోర్డు ఆక్షన్ మేనేజర్ రామాంజనేయులు, ఒంగోలు ఆర్ఎం రామారావు తదితరులు పాల్గొని వేలం ప్రక్రియకు ఆటంకం కలగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు.

రేపటి నుంచి కొత్త టీచర్లకు శిక్షణ

- 9,10 తేదీల్లో వెబ్ కౌన్సెలింగ్ ● 661 మందికి శిక్షణ

ఒంగోలు విద్య, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన 661 మందికి జిల్లాస్థాయి ప్రాథమిక శిక్షణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. వారికి ప్రభుత్వం ఇప్పటికే నియామక పత్రాలు జారీ చేసింది. నాలుగు కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు చేశారు. పొదిలిలోని సెయింట్ మేరీ బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ టీచర్లకు, చీరాలలోని చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ పీఎస్, బీఎస్, గణితం టీచర్లకు శిక్షణ ఇస్తారు. చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య, సోషల్ టీచర్లకు, కనిగిరి ఆల్ఫా అగ్రికల్చర్ కళాశాలలో సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. 3నుంచి 10వతేదీ వరకు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. ఈనెల 9,10 తేదీల్లో కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించి పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తారు.

ధర్మవరం వరకు రైలు పొడిగింపు

గిద్దలూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వరకు వెళ్తున్న (17261) నెంబరు రైలును తిరుపతి నుంచి ధర్మవరం వరకు 2 నెలలపాటు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయించారు. అక్టోబరు 1 నుంచి నవంబరు 30వ తేదీ వరకు గుంటూరు నుంచి తిరుపతి వరకు వెళ్లే ఈ రైలు ధర్మవరం వరకు వెళ్తుంది. అలాగే అక్టోబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ధర్మవరం నుంచి తిరుపతి మీదుగా గుంటూరుకు ఈ రైలు 19 కోచ్‌లతో వెళ్తుంది. గుంటూరు నుంచి తిరుపతి వరకు పాత సమయాలలోనే ఈ రైలు తిరుగుతుందని, గుంటూరులో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరే ఈ రైలు గిద్దలూరు మీదుగా తిరుపతికి మరుసటి రోజు తెల్లవారుజామున 3.55 గంటలకు చేరి అక్కడి నుంచి పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి, కదిరి మీదుగా ఉదయం 9గంటలకు ధర్మవరం చేరుతుందని అధికారులు ప్రకటించారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ధర్మవరంలో మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి తిరుపతికి 7.15 గంటలకు చేరుతుందని, అక్కడి నుంచి రేణిగుంట, నంద్యాల, గిద్దలూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు గుంటూరు చేరుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



స్వచ్ఛతా హి సేవ సభలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం

- స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సాంఘికసంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం స్థానిక పాత జిల్లాపరిషత్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన సఫాయి మిత్ర సురక్షసివిర్ మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ రాజాబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయుమార్‌లతో కలిసి మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెడుతున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రమంలో ముందుగా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మునిసిపాలిటీల్లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులతో సమానంగా గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ కార్మికులు ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సేవల కోసం ఏ ఆస్పత్రికైనా, ఏ ప్రభుత్వ కార్యాలయానికైనా వెళ్లి గుర్తింపు కార్డుచూపిస్తే వీఐపీలకు ఇచ్చే గౌరవాన్ని పారిశుధ్య కార్మికులకు కూడా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్‌విజయకుమార్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు జీతాల చెల్లింపులో జాప్యంలేకుండా ప్రభుత్వం చూస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రిమ్స్, కిమ్స్, శ్రీరామ్, అస్టర్ రమేష్, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వైద్యులతో పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా క్లాప్‌మిత్రలు 1820 మంది, పారిశుధ్య కార్మికులు 1215 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ఈఎస్ బాలశంకరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

కొత్త టీచర్ల శిక్షణపై సమీక్ష

ఒంగోలు విద్య, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 3నుంచి ప్రారంభం కానున్న కొత్త టీచర్ల శిక్షణపై డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో డీఎస్సీ టీచర్ల పోస్టులకు ఎంపికైన వారు వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణకు హాజరుకావాలని కోరారు. ప్రతి శిక్షణ కేంద్రానికి పర్యవేక్షణకు ఒక ఎంఈవో, ఒక హెచ్ఎంను నియమించారు. శిక్షణకు హాజరయ్యే టీచర్లకు ఉదయాన్నే యోగాపై శిక్షణ ఇప్పించాలని, క్రమశిక్షణ కోసం ప్రతి శిక్షణ కేంద్రానికి ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లను నియమించారు. శుక్రవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులతో డీఈవో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

సమస్యల పరిష్కారం కోసం వైద్యుల ధర్నా

- రేపు చలో విజయవాడను విజయవంతం చేయాలని పిలుపు



ధర్నా చేస్తున్న వైద్యులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమస్యలను పరిష్కరించాలని పలువురు వైద్యాధికారులు డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్‌బాండ్ పదోన్నతులు అమలు చేయాలని తదితర డిమాండ్లతో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పలువురు అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బేసిక్ పే 30శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్ చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద రూ.5వేల అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 3వ తేదీన ఆయా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ఒనారియల్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ సుందర ప్రసాద్, డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రసూల్, డాక్టర్ చైతన్యదీప్ తదితరులు ఉన్నారు.

మందుబాబులకు పోలీసు ట్రీట్‌మెంట్!

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు ● ఫిర్యాదుల కోసం 112 టోల్‌ఫ్రీ నంబరు



శివారు కాలనీల్లో మద్యం సేవిస్తున్న వారితో శుభ్రం చేయిస్తున్న పోలీసులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంతోపాటు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మందుబాబులకు జిల్లా పోలీసులు ప్రత్యేక ట్రీట్మెంట్ ఇచ్చారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని వారితో పారిశుధ్య పనులు, వారు మద్యం సేవించిన ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలగింపు లాంటి పనులు చేయించారు. బుధవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 1034 మందిపై కేసులు నమోదు చేయగా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 293 ప్రదేశాలను గుర్తించి 265 ప్రదేశాలను శుభ్రం చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ మందు బాబులు అల్లర్లకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మీ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో వీడియో గానీ, ఫొటోలుగానీ తీసి 9121102266 నంబరుకు వాట్సాప్ చేయాలన్నారు. లేని పక్షంలో 112కు కాల్ చేయవచ్చని తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

గనులపై దృష్టి సారించాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు, సీనరేజ్ తదితరాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం గనులు, ఏపీ ఎండీసీ, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, రవాణా, ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని గనుల విస్తీర్ణం, వాటి రకాలు, లభిస్తున్న ఉపాధి, రవాణా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై ఆయా శాఖల అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత ఇదే సయానికి 18 శాతం వృద్ధి ఉన్నట్లు గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వం జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా నిర్దేశించినందున అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 12 స్టాక్ పాయింట్ల యార్డులలో 80వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ డాక్టర్లతో వైద్య సేవలు

- పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాట్లు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు ఆందోళనబాట పట్టడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది. జిల్లాలో 64 పీహెస్‌సీల పరిధిలో 138 మంది వైద్యాధికారులు పనిచేస్తుండగా వారిలో ఐదుగురు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వైద్యాధికారులందరూ సమ్మెబాటలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ముందుగా జిల్లాలో పరిస్థితిని గమనించిన కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఆయా పీహెచ్‌సీలకు ప్రత్యామ్నాయ వైద్యాధికారులను నియమించారు. వారందరూ బుధవారం 50 మంది విధుల్లో చేరాల్సి ఉండగా 42 మంది డాక్టర్లు వైద్య సేవలు అందించారు. ఇప్పటివరకు రోజువారీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు నాలుగువేలకుపైగా ఓపీలు వస్తుండగా బుధవారం కూడా సుమారు 3,500లకుపైగా ఓపీలు వచ్చాయి. మెడికల్ కాలేజీ నుంచి 50 మంది, కమ్యూనిటీ వైద్యశాల నుంచి 20 మంది వైద్యులను నియమించారు. జిల్లాలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల్లో కార్డుదారులకు బుధవారం రేషన్‌పంపిణీ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 1,392 రేషన్‌షాపుల పరిధిలో 6.61 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు బియ్యం, చెక్కర పంపిణీ ప్రారంభమయ్యాయి. కార్డుదారులకు ఆయా రేషన్‌షాపుల ద్వారా ఉదయం, సాయంత్రం సమయంలో కార్డుదారులకు పంపిణీ చేశారు. తొలిరోజు 20శాతం మంది కార్డుదారులు రేషన్ తీసుకున్నట్లు సమాచారం. దసరా పండుగ కావడంతో కొంతమంది కార్డుదారులు వారి స్వగ్రామాలకు వెళ్లడంతో కొంతమేర తీసుకున్నారు. శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ వేగంగా జరిగే అవకాశం ఉంది.

జిల్లా క్షయ నివారణాధికారిగా డాక్టర్ బాలాజీ



జిల్లా క్షయనివారణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాలాజీని సత్కరిస్తున్న ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్షయ నివారణ, లెప్రసీ ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ బాలాజీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న బాలాజీ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ రాజాబాబును, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లుతో పలు అంశాలపై చర్చించారు. క్షయ నియంత్రణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన బాలాజీని ఆ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, అకోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం రాత్రి ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసే విధంగా దృష్టి సారించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం లక్ష్యాలను సాధించేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 80,811 దరఖాస్తులు రాగా అందులో 2,553 దరఖాస్తులు గ్రౌండింగ్ చేయగా 2442 సోలార్ ఇన్సులేషన్ పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

రేపటి నుంచి మూడో విడత రీసర్వే

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 25 మండలాల పరిధిలోని 35 గ్రామాల్లో శుక్రవారం నుంచి మూడో విడత రీసర్వే ప్రారంభిస్తున్నట్లు సర్వేశాఖ ఎడీ గౌస్‌బాషా బుధవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూమి 15,042.86 ఎకరాలు, పట్టాభూమి 50,397.42 ఎకరాలు కలిపి 65,440.48 ఎకరాల భూమిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం 42 సర్వే బృందాలను నియమించినట్లు తెలిపారు. ఒక్కొక్క బృందంలో ఇద్దరు చొప్పున 84 మంది సర్వేయర్లను, 42 రోవర్ల సహాయంతో ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.

వైభవంగా దసరా శరన్నవరాత్రులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమ్మలగన్న అమ్మ.. ముగ్గురు అమ్మల మూలపుటమ్మ జగన్మాతకు దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని పట్టణంలో అమ్మవార్లు బుధవారం వివిధ అలంకారాల్లో భక్తలకు దర్శనం ఇచ్చారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మిగా, మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ సిద్ధిదాయినిగా వాసవీ మాత గజలక్ష్మి భక్తులకు దర్శనం ఇచ్చారు. జవహర్ నగర్‌లోని ఆమలక లక్ష్మీనారాయణ ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు.

గిద్దలూరు : దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు వారాహీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల సందర్భంగా దేవాలయంలో చండీహోమం నిర్వహించారు. షరాఫ్ బజారులోని వేంకటేశ్వరస్వామి వామన అవతారంలో దర్శనమిచ్చారు.

త్రిపురాంతకం : త్రిపురాంతకేశ్వరస్వామి బాలాత్రిపురసుందరిదేవి ఆలయంలో అమ్మవారు బుధవారం సిద్ధిదాయనిగా అశ్వవాహనంపై భ క్తులకు దర్శనమిచ్చింది. బాలాత్రిపురసుందరీదేవిని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు దర్శించుకున్నారు.

పెద్దదోర్నాల : దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు శ్రీ మహాచండీ అవతారంలో దర్శనమిచ్చారు. వాసవీమాత, పోలేరమ్మ సాయిబాబా మందిరం, తిమ్మాపురంలోని శ్రీ చౌడేశ్వరీదేవిఆలయంలో పూజలు నిర్వహించారు.

కంభం : శ్రీ కోటా సత్యమాంబదేవి శ్రీ బాల హృదయేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారు శ్రీ మహంకాళీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


త్రిపురాంతకం, మార్కాపురం, కంభంలో వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు

ప్రతి ఇంటా సంక్షేమ పండుగ

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం, సంతోషం కలుగుతుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను 1వ వార్డులో గల గణేష్ నగర్‌లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా 106 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధురాలికి పింఛన్ ఇచ్చి ఆమె నుంచి ఆశీర్వాదం పొందారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో ప్రభుత్వం దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు షానేషావలి, మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్ చైర్మన్ బైలడుగు బాలయ్య, గోడి ఓబులరెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, బీజేపీ నాయకులు జేవీ నారాయణ, స్థానిక నాయకులు షేక్ జాఫర్, షేక్ అహమ్మద్‌బాషా, తోట శేషగిరిరావు, కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రజల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే కందుల

మార్కాపురం : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను ఆయన బుధవారం నియోజకవర్గంలోని పలుచోట్ల పంపిణీ చేశారు. ఏకలవ్య కాలనీలో పెన్షన్ అందజేసిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించడమేకాక అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మాజీ అధ్యక్షుడు షేక్ మౌళాలి, మాజీ ఏఎంసీ చైర్మన్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుల కళ్లల్లో ఆనందం : ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : వృద్ధుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని వై కొత్తపల్లి గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పీ రామసుబ్బయ్య, టీడీపీ మండల నాయకులు వేగినాటి శ్రీను, చిట్యాల వెంగళరెడ్డి, సత్యనారాయణగౌడ్, పేరం రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు పి మల్లికార్జునరావు, తోట మహేష్ పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లాకు నూతనంగా నియమితులైన కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ వీ విష్ణువర్ధన్‌రాజును బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై వారితో చర్చించారు.

అడవి జంతువులను చంపితే శిక్ష తప్పదు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : అడవి జంతువులను చంపడం చట్టరీత్యా నేరం, వారికి 3 నుంచి ఏడేళ్ల జైలు తప్పదని గుండ్లకమ్మ రేంజ్ ఆఫీసర్ వీవీ నరసింహారావు అన్నారు. డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి ఆధ్వర్యంలో నరసింహారావు వెల్లుపల్లె, జయరాంపురం, పుల్లలచెరువు, అనంపల్లె, రాచర్ల ప్రజలకు అవగాహన కల్పించారు.





వాహనాల తనిఖీ

కంభం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజులు మూడు మండలాలలో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు అర్ధవీడు మండల ఫారెస్ట్ ఆఫీసర్ రంగారెడ్డి తెలిపారు. దసరా స్పెషల్ డ్యూటీలో భాగంగా అటవీ శాఖ అధికారులు కృష్ణాపురం, వెలగలపాయ, తురిమెళ్ల, గన్నేపల్లి, రంగాపురం, దేవనగరం గ్రామాలలోని ముఖ్యమైన కూడళ్లలో వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. వన్య ప్రాణులను వేటాడడం నేరమని, వన్యప్రాణులకు హాని తలపెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల తనిఖీల్లో ఫారెస్ట్ అధికారులు బాలాజీ నాయక్, అబ్దుల్ గఫార్, రాజేష్, కల్యాణి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

మార్కాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. బుధవారం సర్కిల్ పరిధిలోని పోలీసులు విస్తృతంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై తనిఖీలు నిర్వహించారు. యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.



















ఒద్దులవాగుపల్లిలో రైతు ఆత్మహత్య

రాచర్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒద్దులవాగుపల్లి గ్రామంలో మదిరె ఈశ్వర్‌రెడ్డి (61) అనే రైతు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. అప్పుల బాధతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అతనికి భార్య అల్లూరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

పొదిలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకులు అద్దంకి ప్రసాద్, వెంకటేశ్వర్లు, జువ్వలేరుకు చెందిన నరసమ్మ మృతి చెందగా ఎమ్మెల్యే కందుల పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.












ఆంధ్రజ్యోతి కి శుభాకాంక్షలు
అక్షరాలనే ఆయుధాలుగా మలిచి.
నిజాలను నిగ్గు తేల్చుతూ... అలుపెరుగని పోరాటం చేస్తూ...
దమ్మున్న పత్రికగా పాఠకుల అభిమానాన్ని చూరగొంటూ...
23వ వసంతంలోకి అడుగిడుతున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక
యాజమాన్యానికి, పాత్రికేయులకు మరియు సిబ్బందికి
ఇవే మా శుభాకాంక్షలు...
మరియు మండల ప్రజలకు దసరా, దీపావళి శుభాకాంక్షలు
23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీ రాజాబాబు, IAS గారు
కలెక్టర్ మరియు డిస్ట్రిక్ మెజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా
డా॥ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గారు
శాసనసభ్యులు, కనిగిరి
ఆర్.వాసుదేవరావు తహసీల్దార్ పామూరు
ఎల్.బ్రహ్మయ్య MPDO పామూరు
డి.వి.కృష్ణారెడ్డి DEE, ట్రాన్స్‌కో పామూరు
షేక్ జిలానిబాష AE, ట్రాన్స్‌కో పామూరు
డా॥ ఆర్.రమేష్ AD, వెటర్నరి హాస్పిటల్ సీఎస్‌పురం
డా॥ షేక్ మునీర్ పశు వైద్యాధికారి సీఎస్‌పురం
డా॥ ఆర్.హనుమాన్ పశు వైద్యాధికారి పామూరు
డా॥ ఎం.ప్రవీణ మెడికల్ ఆఫీసర్ CHC, పామూరు
డా॥ గద్దె ఏడుకొండలు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ కంభాలదిన్నె
డా॥ పుండరీకాంక్షరావు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ ఆరివేముల
వి.బ్రహ్మానందరెడ్డి పంచాయతీ కార్యదర్శి సీఎస్‌పురం
పిడ్డిరెడ్డి కోటిరెడ్డి MEO-1 పామూరు
కె.కరుణకుమారి MEO-2 పామూరు
యాదాల రమేష్ RWS AE పామూరు
బి.మోహనరావు RWS AE సీఎస్‌పురం
షేక్ మస్తాన్‌వలి PR AEE పామూరు
బి.బ్రహ్మయ్య PR AEE సీఎస్‌పురం
కోటిరెడ్డి హౌసింగ్ DE కనిగిరి
వృద్ధి సురేష్ హౌసింగ్ AE పామూరు
టి.అబ్రహంలింకన్ AO పామూరు
కటకం సజన KGBV ప్రిన్సిపాల్ పామూరు
కె.కుసుమ HO, ఉద్యానశాఖ పామూరు
గోపాలుని రమేష్ MLS పాయింట్ DT పామూరు
బి.నరసింహారావు HWO, SC బాయిస్ హాస్టల్, పామూరు
ప్రకాశ్‌రావు సర్వ శిక్ష AE పామూరు
శ్రీగిరిరాజు నరశింహారావు EO, ఎండోమెంట్ పామూరు, మిట్టపాలెం
డి.వంశీ కృష్ణారెడ్డి EO, ఎండోమెంట్ భైరవకోన, సిఎస్‌పురం
ఎ.వెంకటసుబ్బయ్య డిప్యూటి ఫారెస్ట్ ఆఫీసర్, పామూరు
గోళ్ల పద్మజ ICDS సూపర్‌వైజర్ బొట్లగూడూరు
ఎంవిఎస్ పార్వతి ICDS సూపర్‌వైజర్ వగ్గంపల్లి
దేవ కృపావరం ICDS సూపర్‌వైజర్ సీఎస్‌పురం
ఎన్ శేషిరెడ్డి CEO, PACS పామూరు
చీతిరాల రమేష్ శ్రీ సాయి శివ రైస్‌మిల్ పామూరు
షేక్ కాలేషామస్తాన్ పట్టణ లైన్‌మెన్ పామూరు


ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పత్రికా రంగంలో సరికొత్త సంచలనాలను సృష్టిస్తూ...
ప్రజల పక్షపాతిగా కీర్తి గడించి... తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని
ముద్రవేసుకున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక 22 వసంతాలు పూర్తిచేసుకొని
23వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా
యాజమాన్యానికి, పాత్రికేయులకు, సిబ్బందికి శుభాకాంక్షలు...
అధికారులకు, మండల ప్రజలకు, టీడీపీ శ్రేణులకు
దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ...
తాళ్లూరు మండల తెలుగు తమ్ముళ్లు
మేడగం వెంకటేశ్వరరెడ్డి మండల టీడీపీ అధ్యక్షులు లక్కవరం
తాటికొండ శ్రీనివాసరావు ఎంపీపీ, మాధవరం
బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి రాష్ట్ర నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్
మానం రమేష్‌బాబు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి విరలాపురం
గొల్లపూడి వేణుబాబు రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కొర్రపాటివారిపాలెం
నల్లపాటి సత్యనారాయణ దర్శి మార్కెట్ కమిటి డైరెక్టర్ దోసకాయలపాడు
గొంది రమణారెడ్డి (సమర) సొసైటి ప్రెసిడెంట్ మన్నేపల్లి
రాచకొండ వెంకట్రావు మండల టీడీపి క్లస్టర్ ఇన్‌చార్జి బెల్లంకొండవారిపాలెం
ఇడమకంటి శ్రీనివాసరెడ్డి టిడిపి యువనేత, తాళ్లూరు
కైపు రామకోటిరెడ్డి టిడిపి సీనియర్‌నేత, కొత్తపాలెం
సిహెచ్.వీరనాగిరెడ్డి టిడిపి సీనియర్‌నేత, వెలుగువారిపాలెం
పోలంరెడ్డి రమణారెడ్డి టిడిపి సీనియర్ నాయకులు, బొద్దికూరపాడు
గాడిపర్తి లక్ష్మీనారాయణ మాజీ ఎంపిటిసి, టిడిపి నేత శివరాంపురం
నవులూరి విద్యాసాగర్ టిడిపి యువనేత విరలాపురం
కొర్రపాటి రామయ్య టిడిపి సీనియర్‌నేత కొర్రపాటివారిపాలెం
గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (చందన) టిడిపి సీనియర్‌నేత తూర్పుగంగవరం
డా॥ లలిత్ సాగర్ గారు
డా॥ గొట్టిపాటి లక్ష్మీ గారు
టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి

జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

నూతలపాడులో ఎమ్మెల్యే ఏలూరితో కలసి

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

పర్చూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వస్తు సేవా పన్ను తగ్గింపుతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా ప్రజల ఆదాయ వనరులు పెరుగుతాయని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఏపీ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మండలంలో శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలసి బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. నూతలపాడులో రూ.1.80 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు వారు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 70 డ్వాక్రా గ్రూపు పొదుపు సంఘాలకు రూ.2.50 కోట్ల బ్యాంక్ రుణాల చెక్కులను అందజేశారు. అదేవిధంగా 20 మంది విభిన్న ప్రతిభావంతులకు వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. మరో ఐదుగురికి రూ.2.50 లక్షల విలువ చేసే ట్రైసైకిళ్లను మంత్రి, శాసనసభ్యుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం గ్రామంలో రూ.4కోట్ల వ్యయంతో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ



నూతలపాడులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఏలూరి

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి నిబద్ధతకు నిలువుట్టద్దంగా ప్రజాప్రభుత్వం నిలిచిందన్నారు. అందుకు నిదర్శనం ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలేనని చెప్పారు. వస్తు సేవా పన్ను తగ్గింపుతో ప్రతి కుటుంబానికి నిత్యవసర వస్తువుల కొనుగోలులో ఏటా రూ.15వేలు మిగులుదల ఉంటుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఇప్పటికే రాష్ట్రంలో రూ.10వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకొని, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిన చొరవను పొగాకు రైతులు ఎన్నటికీ మరిచిపోరని చెప్పారు. ఇప్పటికే 20 మిలియన్ కేజీల నల్ల బర్లీ పొగాకును కొనుగోలు చేశామని, అదనంగా మరో 20 మిలియన్ల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని వివరించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త టీడీపీ నాయకులు విన్నకోట రవి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, ఆర్డీవో గ్లోరియా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, టీడీపీ నాయకులు విన్నకోట సతీష్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ డైరెక్టర్ షంషుద్దీన్, తిరుములశెట్టి శ్రీహరి, కంచేటి శ్రీహరి పాల్గొన్నారు.

● కల్యాణ మండపం ప్రారంభం

ఈ సందర్భంగా నూతలపాడులో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ఏలూరి, మంత్రి పార్థసారథిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత పెదపూడి విజేయ్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ పోలూరి శివారెడ్డి పాల్గొన్నారు.

ఇంకొల్లులో పైలెట్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఏలూరి

ఇంకొల్లు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో అన్ని రంగాల్లో రాణించాలంటే ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. భారత పౌర విమానయానశాఖ అనుమతితో డ్రోన్‌ల్యాబ్ టెక్నాలజీస్, అహ్మదాబాద్ మారుతి ఐటీఐ వారిచే సంయుక్తంగా ఇంకొల్లులో ఏర్పాటు చేసిన డ్రోన్ శిక్షణా కేంద్రాన్ని (రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్) బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డ్రోన్‌ను ఆపరేట్ చేశారు. అనంతరం కారుమూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో యువతకు ఉపయోగపడే ఆలోచనతో డ్రోన్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు, డైరెక్టర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా అన్నదాన మణి హాజరై హాస్యప్రాసలతో సభికులను అలరింపజేశారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.





దేవీ నమో నమః

దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని చీరాల డివిజన్‌లోని అన్ని నియోజకవర్గాల్లోని పలు అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పేరాల చిన్న బోసుబొమ్మ సెంటర్ పందిరిలో, కెఎస్సార్ హ్యాండ్‌లూమ్స్‌లో మహిషాసురమర్దినీ దేవీ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే ఎంజీసీ మార్కెట్‌లోని వాసవీ అమ్మవారి ఆలయంలో కూరగాయలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అద్దంకి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని మహిషాసురమర్దిని అవతారంలో అలంకరించారు. అలాగే వేయిస్తంభాల గుడి, పోలేరమ్మ దేవాలయం, దత్తపాదుకాక్షేత్రం, కనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఇక పంగులూరు, మార్టూరు, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, చినగంజాం తదితర మండలాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.

అద్దంకిలో 220 కేవీ సబ్‌స్టేషన్

ఏర్పాటుకు కసరత్తు చేస్తున్న అధికారులు

స్థల పరిశీలన, ప్రతిపాదనలు సిద్ధం



అద్దంకి కొండ వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదించిన స్థలం

అద్దంకి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలలో మరింత మెరుగైన విద్యుత్ సరఫరాకు వీలుగా అద్దంకిలో 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దశాబ్ద కాలం క్రితం అద్దంకిలో 132 కెవి సబ్‌స్టేషన్‌ను కొండ వద్ద ఏర్పాటు చేశారు. గ్రానైట్ పరిశ్రమ బాగా విస్తరించిన నేపథ్యంలో మార్టూరులో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటైంది. అదే సమయంలో దర్శిలో కూడా 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. కొత్తగా ఏల్చూరు వద్ద కూడా 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైంది. ఇప్పటికే స్థల సేకరణ కూడా పూర్తయ్యింది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. అయితే అద్దంకికి అందుబాటులో 220 కేవీ సబ్‌స్టేషన్ లేకపోవటం నాలుగు వైపులా ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్లకు మధ్య ఉండే విధంగా అద్దంకి సమీపంలోని కొండ వద్ద ఇప్పటికే ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ పక్కనే 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే స్థల పరిశీలన కూడా పూర్తయ్యింది. ఇటీవల సమీక్షకు వచ్చిన సీఎండీ కూడా అద్దంకిలో 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు ఆవశ్యకతను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో దానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. ఈ స్టేషన్ ఏర్పాటుతో బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు, ప్రకాశం జిల్లాలోని దర్శి నియోజకవర్గానికి మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం కలగనుంది.

ప్రతి కుటుంబంలో ఆర్థిక సమస్య నియంత్రణకు కృషి లోపలి పేజీల్లో..

మృతులకు కూలి ఎలా చెల్లిస్తారు?

సామాజిక తనిఖీ ప్రజావేదికలో ప్రశ్నించిన ఏపీడీ



పెదగంజాం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఏపీడీ సింగయ్య

చినగంజాం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో చనిపోయిన వారికి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తున్న వారికి మస్టర్లు వేసి పేమెంట్లు ఎలా చెల్లిస్తున్నారని చినగంజాం ఫీల్డ్ అసిస్టెంట్ బి.రమేష్‌ను చీరాల క్లస్టర్ డ్వామా ఏపీడీ సింగయ్య ప్రశ్నించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో 2024-25లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఏపీడీ మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన వారికి రెండు, మూడు జాబ్ కార్డులు ఎందుకు ఇస్తున్నారని పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. పలుగ్రామాల్లో సామాజిక తనిఖీలో గుర్తించిన లోపాలైన కూలీల సంతకాలు, వేలిముద్రలు లేకుండా బిల్లు ఇవ్వడం, వరదకట్టలు, కాలువలు తగ్గించి చేయడం, మరుగుదొడ్ల బిల్లులో అవకతవకలు, ప్లాంటేషన్‌లో లోపాలు తదితర విషయాలను డీఆర్‌పీలు సభలో చదివి వినిపించారు. మొక్కలు నాటి సంరక్షించాలని ఏపీడీ సూచించారు. చినగంజాం మండలంలో 782 పనులకు వేతనాలు, మెటీరియల్స్‌కు రూ.13.33 కోట్ల రూపాయిలు ఖర్చు చేసినట్లు ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ పీ ఈశ్వర్‌రావు, డీవీవో చంద్రశేఖర్, ఎస్‌ఆర్‌పీ ఎం నాగరాజు, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్, పంచాయతీరాజ్ ఏఈ దాసు, ఏపీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు.



వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోండి

అద్దంకిటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు నిపుణులైన వైద్యాధికారులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోందని తహసీల్దార్ శ్రీచరణ్ చెప్పారు. బుధవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ప్రధానమంత్రి స్వస్త్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీవో వరూధిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.వాహిలా చౌదరి, డాక్టర్లు వెంకటకిరణ్, తేజస్వవి, అనితాజ్యోతి, సాయిప్రసాద్, స్రవంతి, హరిబాబు, సందీప్, ప్రదీప్‌కుమార్‌లు పాల్గొని మానసిక, చెవి, గొంతు, ముక్కు, దంత, చర్మ, గర్భిణులు, శస్త్రచికిత్సతో పాటు సాధారణ వ్యాధులకు సంబంధించి 200 మందిని పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, బీజేపీ నాయకులు సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 10 మంది రక్తదానం చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాహిలా చౌదరి తెలిపారు.

ప్రతి కుటుంబంలో ఆర్థిక సమస్య నియంత్రణకు కృషి

రూ.11.16 కోట్లు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఆనందోత్సాహాల్లో పొదుపు సంఘాల మహిళలు, చిరువ్యాపారులు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కుటుంబంలో ఆర్థిక పరమైన సమస్యల నియంత్రణకు ప్రజాప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. బుధవారం స్థానిక బాపనమ్మ కల్యాణ మండపంలో మెప్మా మేనేజర్ కొండయ్య ఆధ్వర్యంలో సీఎం స్వానిధి 2.0 కార్యక్రమంలో భాగంగా కల్యాణ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 53 పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా రూ.10.02 కోట్లు, అలాగే పీఎం స్వానిధి ద్వారా 503 మంది వీధి విక్రయిదారులు, చిరువ్యాపారులకు రూ.1.02 కోట్లు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరువ్యాపారులను సైతం ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. బ్యాంకుల ద్వారా అందిన సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం అందించే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని దేశాయిపేట, రామకృష్ణాపురం, మున్సిపల్ పరిధిలోని 16 వార్డులో నిర్వహించారు. అలాగే వస్త్రవ్యాపారులతో జీఎస్టీ సంస్కరణల ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో రైతులకు జీఎస్టీ తగ్గింపులతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ఎన్డీయే పెద్దపీట



ర్యాలీలో వ్యవసాయ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, అధికారులు

అద్దంకిటౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వ్యవసాయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ చెప్పారు. బుధవారం వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నందు వ్యవసాయ పనిముట్లతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డు నుంచి బంగ్లారోడ్డు వరకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్‌లతో ర్యాలీ నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గించి పేదలకు భారం తగ్గించిందని రామకృష్ణ అన్నారు. ఈ తగ్గింపుతో రైతులకు అత్యధికంగా డ్రోన్లకు 13శాతం, ట్రాక్టర్‌లకు, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రిప్, తుంపర సేద్యం పరికరాలపై 7శాతం తగ్గింపు వచ్చిందని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీవో వరూధిని, మార్కెట్ యార్డు కమిటి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.





గాయపడిన యువకుడు మృతి

మేదరమెట్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డుపై ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కొరిశపాడు మండలం బొడ్డువానిపాలేనికి చెందిన అన్నెం ఉదయభాస్కర్ రెడ్డి(26) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... ఉదయభాస్కరరెడ్డి బావ టంగుటూరు మండలం కె.ఉప్పలపాడుకు చెందిన దేవరపల్లి అశోక్‌రెడ్డి(35) లండన్‌లో ఉద్యోగం చేస్తూ సెలవులపై ఇంటికొచ్చాడు. శనివారం రాత్రి విమానం ఎక్కేందుకు తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అదేరోజు రాత్రి భార్యను బస్సులో హైదరాబాద్ పంపించిన అశోక్‌రెడ్డి లగేజి తీసుకుని బావమరిది ఉదయభాస్కర్‌రెడ్డి, చిన్నకుమార్తెతో కలిసి కారులో బయలుదేరారు. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై వెళుతుండగా జరిగిన ప్రమాదంలో అశోక్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా ఉదయ్‌భాస్కర్ రెడ్డి చికిత్స పొందుతూ మంగళవారంరాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో చిన్నపాప సీట్ల కిందకు జారడంతో ప్రమాదం నుంచి బయటపడింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు పాపను కారునుంచి బయటకు తీసి కాపాడారు. ఉదయ్‌భాస్కర్‌రెడ్డికి ఇంకా వివాహం కాలేదు. అశోక్‌రెడ్డికి ఆరేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఉదయ్‌భాస్కర్‌రెడ్డికి చిన్న వయస్సులోనే తండ్రి మరణించాడు. రోడ్డు ప్రమాదంలో అల్లుడు, కుమారుడు చనిపోవడంతో ఆ తల్లి బాధ వర్ణనాతీతం. బుధవారం మృతదేహాన్ని బొడ్డువానిపాలెం తీసుకురావడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.





పట్టుబడిన గేదెల దొంగ

ఇద్దరు పరారీ

పోలీసులకు అప్పగింత

ఈపూరుపాలెం(చీరాల), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గేదెల దొంగతనానికి పాల్పడిన నిందితుడికి గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... మండల మండల పరిధిలోని ఈపూరుపాలెం పంచాయతీ సావరపాలెంలో బుధవారం వేకువజామున ఓ ఇంటి కొష్టంలో అలికిడి కావడంతో యజమాని బయటకు వచ్చి చూశాడు. ముగ్గురు వ్యక్తులు ఆటోలో గేదెలను దొంగిలించే ప్రయత్నం చేస్తుండటంతో బిగ్గరగా కేకలు వేశారు. ఇద్దరు పరారవగా సాతుపాటి లక్కీ స్థానికులకు పట్టుబడ్డాడు. అతడిని పట్టుకుని దేహశుద్ధి చేయడంతో గేదెల అపహరణకు వచ్చినట్లు ఒప్పుకున్నాడు. అంతకుముందే మూడు గేదెలను అపహరించి స్థానిక కారంచేడు రైలు గేటు దగ్గర పెట్రోలు బంకు వెనుకకు చెందిన ఓ వ్యక్తికి వాటిని విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. దాసరి నవీన్, వల్లభ కొర్నేలు పరారీ అయినట్లు చెప్పాడు. దీంతో అతడిని ఈపూరుపాలెం పోలీసులకు అప్పగించడంతో వారు కేసు నమోదుచేశారు.



బాణసంచా నిల్వ చేస్తే చర్యలు

అద్దంకి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాజు చెప్పారు. అద్దంకి పట్టణానికి సమీపంలో మేదరమెట్ల రోడ్డు, శింగరకొండరోడ్డులో ఉన్న బాణసంచా దుకాణాలను బుధవారం సీఐ సుబ్బరాజు పరిశీలించి తగు సూచనలు చేశారు.

శిక్షణార్థులకు మరిన్ని సదుపాయాలు

ఎస్‌ఆర్ ఖోఖో అకాడమీ చైర్మన్ డాక్టర్ గరటయ్య

విజేతగా రైజింగ్ ఈగల్స్ జట్టు



మాట్లాడుతున్న గరటయ్య

పంగులూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందే క్రీడాకారులకు మెరుగైన భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని అకాడమీ చైర్మన్ డాక్టర్ బి.సిహెచ్.గరటయ్య చెప్పారు. మూడురోజులుగా పంగులూరు ఎంఎస్‌ఆర్ అండ్ బీఎస్‌ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ నిర్వహించిన సూపర్‌లీగ్ ఖోఖో పోటీలలో విజేతలకు బుధవారం డాక్టర్ గరటయ్య బహుమతులు అందజేశారు. ఖోఖో పోటీలలో రైజింగ్ ఈగల్స్ జట్టు విజేతగా నిలిచింది. ఐరన్ బుల్స్ ద్వితీయస్థానం కైవసం చేసుకోగా, ఫైర్ కింగ్స్ మూడోస్థానం దక్కింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ సీతారామిరెడ్డి, రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల వీరనారాయణ, క్లబ్ ప్రతినిధులు షేక్ కాలేషావలి, ఆర్.వి.సుబ్బారావు, కరణం హనుమంతరావు పాల్గొన్నారు.

ఇంకొల్లులో ట్రాక్టర్లతో ర్యాలీ

ఇంకొల్లు, అక్టోబరు 1,(ఆంధ్రజ్యోతి) : ఎన్డీయే ప్రభుత్వం నూతన జీఎస్టీ సంస్కరణలతో వివిధ రకాల నిత్యవసర వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై అవగాహన కలిగిస్తూ బుధవారం ఇంకొల్లులో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ట్రాక్టరు నడుపుతూ యువతను ఉత్సాహపరిచారు.

వెంపరాలలో 107 మంది జ్వరపీడితులకు వైద్య పరీక్షలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంపరాలలో మోదేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన వెంపరాలను వెంటాడుతున్న విషజ్వరాలు అనే కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టగా వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం గ్రామంలోని సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించి 107 మంది జ్వరపీడితులకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైరల్ ఫీవర్, టైఫాయిడ్ ఫీవర్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఏడుగురు వద్ద సీరమ్ శ్యాంపిల్స్ సేకరించి జిల్లా వైద్యశాలకు పంపించారు. సర్పంచ్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

కాలువలో గల్లంతయిన ఇంటర్ విద్యార్థి మృతి

స్నేహితులతో కలిసి సాగర్ కుడికాలువలో ఈతకు..

మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు

చీరాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : చేతికందిన కుమారుడు మృత్యువాత పడగానే ఆ కుటుంబం బోరున విలపించింది. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని ఆంధ్రకేసరినగర్‌కు చెందిన దరబడి మార్క్ రూఫస్(18) గుంటూరులోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతున్నాడు. తండ్రి ప్రయివేట్ ఉద్యోగి కాగా, తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా ఈపూరుపాలెంలో నివాసముంటూ ఇద్దరు కుమారులను చదివించుకుంటున్నారు. గత సోమవారం నరసరావుపేటలోని ముగ్గురు స్నేహితులతో కలిసి పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుళ్లపల్లి నాగార్జున సాగర్ కుడి కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు రూఫస్, పేటకు చెందిన మరో మిత్రుడు గల్లంతయ్యారు. ఈక్రమంలో ఆ రోజు నుంచి ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం గుంటూరు బ్రాంచి కెనాల్ డీసీఎల్ పవర్ ప్లాంట్ వద్ద విగతజీవిగా కుమారుడు ఒడ్డుకు చేరడంతో బంధువులంతా విలపించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం రాత్రి స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.





















అంబరం.. దసరా సంబరం

● వాడవాడలా అమ్మవారి విగ్రహాలు ● నేటితో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు ● ఈ ఏడాది 11 రోజులు నవరాత్రులు ● ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు సన్నాహాలు

బాపట్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా సంబరాలు అంబ రాన్నంటాయి. అమ్మ వారి విగ్రహాలు వాడవాడలా ఏర్పాటు చేసి, సామూహికంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించారు. సాధారణంగా తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది శాస్త్రం ప్రకారం 11 రోజుల పాటు శరన్నవరాత్రి మహోత్సవాలను వేద పండితుల సూచనల మేరకు నిర్వహిస్తున్నారు. గురువారం విజయదశమి సందర్భంగా ఆలయాలు రంగురంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవారి దర్శనం

బాపట్ల జిల్లాలో దుర్గాష్టమి సందర్భంగా బుధవారం పలు ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమృతలూరులోని గోవాడ శ్రీబాల కోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవి, చందోలులో వేంచేసిన శ్రీబగళాముఖి, జంపని రామేశ్వరాలయం, బాపట్లలోని శ్రీలలితా త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవార్లకు మహిషాసుర మర్దిని విశేషలంకరణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. రేపల్లె పట్టణంలోని పలు ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో మంత్రి అనగాని సత్యప్రసాదు పాల్గొన్నారు.

మార్కెట్లో దసరా అమ్మకాల సందడి

మార్కెట్లో రెండు రోజుల ముందు నుంచే దసరా అమ్మకాల సందడి నెల కొంది. దసరా పర్వదినానికి పూలు, పండ్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన కొను గోలుదారులతో కళకళ లా డుతున్నాయి.



మహిషాసురమర్దిని అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు

అవ్వతాతలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి అనగాని, కలెక్టర్

రేపల్లె, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అవ్వతాతలకు పింఛను ఇవ్వడంలో మోసం చేసిందని.. కూటమి ప్రభుత్వం రాగానే అవ్వతాతల ముఖంలో సంతోషం చూస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రేపల్లె పట్టణంలోని 24వ వార్డు నేతాజీ నగర్‌లో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను మంత్రి అనగాని కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నవాళ్లకు త్వరలో పింఛన్లు అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్హత లేని వారికి దొంగ సర్టిఫికెట్లతో పింఛన్లను తమ నాయకులకు ఇప్పించుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి పింఛను అందిస్తుందని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటవ తేదీనే ఇంటి వద్దకు వచ్చి పింఛను ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని లబ్ధిదారులు చెప్తుంటే.. ఆనందం ఉందని మంత్రి అనగాని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి రూ.4వేలు పింఛను అందిస్తున్నామన్నారు. రేపల్లె పట్టణాన్ని రూ.50 కోట్లతో అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు మంత్రి వెల్లడించారు. జగన్ పాలనలో కనీసం రోడ్లకు గుంతలు పూడ్చిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల్లో రహదారులు, డ్రైయినేజీలు, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిందన్నారు.

కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ కృష్ణా నదికి వరద పోటెత్తడంతో పునరావస కేంద్రాల్లో ఉన్న పెన్షన్ లబ్ధిదారులకు అక్కడికే.. వచ్చి పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ఏమైన లోపాలు ఉంటే వాటిని పరిష్కరించే దిశగా అధికారులు చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు జీవీ నాగేశ్వరావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తిభాస్కరరావు, ఆర్డీవో రామలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, కొలసాని రాము, మేకా శివరామకృష్ణ, గోగినేని పట్టాభి రామారావు, జీవీనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



24వ వార్డు నేతాజీ నగర్‌లో వృద్ధాప్య పింఛన్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ వినోద్‌కుమార్

'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పోస్టర్ల ఆవిష్కరణ

కొల్లూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన కల్పించే సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ ప్రచార పోస్టర్లను రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. కొల్లూరులో వరద విపత్తుపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్ కాలువకు టెండర్లు

● రూ.370 కోట్లతో లైనింగ్, కాంక్రీటు గోడల నిర్మాణ పనులకు అధికారుల చర్యలు
● ఈనెల 15 వరకు గడువు
● 16న సాంకేతిక, 22న ఆర్థిక బిడ్‌ల పరిశీలన
● నెలాఖరుకు అగ్రిమెంట్ పూర్తయ్యే అవకాశం
● వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో కీలక అడుగు



వర్షాలకు దెబ్బతిన్న ఫీడర్ కాలువ (ఫైల్)

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ తొలిదశను వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు అధికారులు మరో అడుగు ముందుకు వేశారు. ప్రస్తుతం అత్యంత కీలకంగా భావిస్తున్న ఫీడర్ కెనాల్ ఆధునికీకరణ పనులకు టెండర్లు పిలిచారు. తీవ్ర ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లోనూ వెలిగొండపై సీఎం ప్రత్యేక దృష్టితో నిధులకు భరోసా ఇచ్చిన విషయం విదితమే. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన పనులకు సంబంధించి పేరుకుపోయిన బకాయిల్లో ఇటీవల రూ.344 కోట్లు చెల్లింపులు చేయడంతోపాటు మరో రూ.456 కోట్లను ఫీడర్ కాలువ పనుల కోసం మంజూరు చేశారు. అలా చేసిన వారానికే ఆ పనులకు ప్రాజెక్టు అధికారులు టెండర్లు పిలిచారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కాలువ పనులు చేసేందుకు రూ.370 కోట్లతో బుధవారం టెండర్లు పిలిచారు. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.456 కోట్లు మంజూరు చేయగా 18 శాతం జీఎస్టీ, సీనరేజ్, ఇతరత్రా పోను రూ.370 కోట్లు అవసరంగా అంచనా వేసి ఆ మేరకు టెండర్లను ప్రాజెక్టు ఎస్ఈ అబుత్ అలీ పిలిచారు. ఇందులో ఫీడర్ కాలువ 21.80కి.మీ పొడవునా లైనింగ్ చేస్తారు. కాలువ అడుగు భాగంలో 23 వెడల్పు అలాగే ఇరువైపులా కట్టల లోపలి భాగంలో ఏటవాలుగా ఏడు మీటర్ల వంతున లైనింగ్ చేస్తారు. దోర్నాల మండలంలో కడపరాజుపల్లి వద్ద కాలువకు ఇరువైపులా ఒక్కొక్క వైపు 0.65 కి.మీ వంతున 1.30 కి.మీ, గంటవానిపల్లి వద్ద 2కి.మీ. పెద్దారవీడు మండలం కలుకానిపల్లి వద్ద మరో 2 కి.మీకుపైగా ఒక్కొక్క వైపున కాంక్రీటు గోడలను నిర్మించాలి. ఆ పనులను చేస్తేనే టన్నెల్ ద్వారా కృష్ణానది నుంచి తీసుకునే నీరు డ్యామ్‌లోకి చేరుతుంది. దీంతో యుద్ధప్రాతిపదికన పనులు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వారం రోజులకే టెండర్లను పిలిచినట్లు ఎస్ఈ చెప్పారు. టెండర్లు దాఖలకు ఈనెల 15 వరకు గడువు ఇచ్చారు. ఆన్‌లైన్‌లోనూ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. టెండర్లు దాఖల గడువు ముగిసిన మరుసటి రోజైన ఈనెల 6న దాఖలు చేసిన కంపెనీల సాంకేతిక బిడ్‌లను అధికారులు పరిశీలన చేయాలని నిర్ణయించారు. సాంకేతికంగా అర్హత పొందిన కంపెనీలకు సంబంధించిన ఆర్థిక బిడ్‌లను ఈనెల 22న పరిశీలించి తక్కువ కోడ్ చేసిన కంపెనీకి పనులు కేటాయిస్తారు. నెలాఖరులోగా అగ్రిమెంట్ కూడా పూర్తిచేసి ఆ వెంటనే పనులు ప్రారంభించే ఆలోచనతో అధికార యంత్రాంగం ఉన్నట్లు సమాచారం.

పండుగలా..

ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ
గత నెలలో ఇచ్చిన వారందరికీ అందజేత
మద్దిపాడులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్
తగ్గించిన జీఎస్టీపై పలుచోట్ల అవగాహన

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సామాజిక పింఛన్‌ల పంపిణీ బుధవారం పడుగలా సాగింది. దసరా పర్వదినం గురువారం కావడంతో తొలిరోజే దాదాపు 90శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రక్రియను సచివాలయ సిబ్బంది చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటలకల్లా 80శాతం మందికి పైగా అందజేశారు. మొత్తం జిల్లాలో 2,84,279 మంది లబ్ధిదారులకు రూ.124.89 కోట్ల మేర పింఛన్ మంజూరైంది. దివ్యాంగుల కేటగిరీలో పలువురు అనర్హులు పింఛన్‌లు పొందుతున్నట్లు గుర్తించి వారికి ప్రభుత్వం గతంలోనే నోటీసులు ఇచ్చింది. వారిలో కొద్ది మంది మాత్రమే తమకు ఉన్న అర్హతలను సూచిస్తూ తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికులు మిన్నకుండిపోయారు. అయినప్పటికీ ఎవరికీ పింఛన్ నిలిపివేయకుండా గతనెలలో ఇచ్చిన వారందరికీ ఈనెలలో కూడా అందజేశారు. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మద్దిపాడులో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో పింఛన్‌లు పంపిణీ చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పామూరు మండలం చట్టుమడుగులో పింఛన్‌లు పంపిణీ చేయగా.. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని రెండో వార్డులోనూ, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పట్టణంలోని గణేష్‌నగర్‌లో పాల్గొన్నారు. టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గుడూరు ఎరిక్షన్‌బాబు ఎర్రగొండపాలెంలోని వై.కొత్తపల్లిలో, టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దొనకొండ మండలం గంగదేవిపల్లిలో పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో జీఎస్టీ తగ్గింపుపై జిల్లాలోని పలుచోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

వారంలో కిలోకు రూ.15నుంచి 20తగ్గిన గరిష్ఠ ధరలు
కొండపిలో రైతుల నిరసన.. ఆగి సాగిన వేలం
ఒంగోలు-2లో వేలాన్ని పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ
పలు సమస్యలను వివరించిన రైతు నాయకులు
కంపెనీల ప్రతినిధులతో బోర్డు అధికారుల భేటీ



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు ఈడీ విశ్వశ్రీ

పొగాకు ధరలు పతనం

ఒంగోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ తిరోగమనంలో నడుస్తోంది. కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్న వేళ ధరలు పెరగాల్సిందిపోయి దిగజారుతున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి గరిష్ఠ ధరలను దిగ్గోస్తున్నారు. వారం రోజులుగా సగటున కిలోకు రూ.15నుంచి రూ.20 మేర ధరలు తగ్గించి వేశారు. నెల క్రితం వరకు దక్షిణాదిలో కిలో గరిష్ఠ ధర రూ.280 ఉండగా క్రమంగా తొలుత రూ.300, తర్వాత రూ.330.. అలా వారం క్రితం వరకూ రూ.346కు పెంచి వ్యాపారులు ఇచ్చారు. దీంతో రైతుల్లో కాస్తంత ఉత్సాహం కనిపించింది. అయితే వారంలోనే వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పతనం దిశగా సాగుతున్నాయి. అత్యధిక శాతం మేలు రకం బేళ్లను కిలో రూ.320 నుంచి రూ.325 లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇంకా తగ్గుతాయన్న సంకేతాలను కూడా బయ్యర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై బుధవారం కొండపి వేలం కేంద్రంలో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు.

కొనుగోళ్లను పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ

పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ బుధవారం ఒంగోలు-2 వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో కొంతసేపు సమావేశమయ్యారు. దిగజారుతున్న గరిష్ఠ ధరల విషయాన్ని రైతు ప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు పొగాకు కొనుగోలు చేస్తున్న వివిధ కంపెనీల బయ్యర్లతో స్థానిక ఆర్ఎం కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. బోర్డు ఆక్షన్ మేనేజర్ రామాంజనేయులు, ఒంగోలు ఆర్ఎం రామారావు తదితరులు పాల్గొని వేలం ప్రక్రియకు ఆటంకం కలగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు.

రేపటి నుంచి కొత్త టీచర్లకు శిక్షణ

● 9,10 తేదీల్లో వెబ్ కౌన్సెలింగ్ ● 661 మందికి శిక్షణ

ఒంగోలు విద్య, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన 661 మందికి జిల్లాస్థాయి ప్రాథమిక శిక్షణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. వారికి ప్రభుత్వం ఇప్పటికే నియామక పత్రాలు జారీ చేసింది. నాలుగు కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు చేశారు. పొదిలిలోని సెయింట్ మేరీ బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ టీచర్లకు, చీరాలలోని చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ పీఎస్, బీఎస్, గణితం టీచర్లకు శిక్షణ ఇస్తారు. చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య, సోషల్ టీచర్లకు, కనిగిరి ఆల్ఫా అగ్రికల్చర్ కళాశాలలో సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. 3నుంచి 10వతేదీ వరకు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. ఈనెల 9,10 తేదీల్లో కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించి పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తారు.

ధర్మవరం వరకు రైలు పొడిగింపు

గిద్దలూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వరకు వెళ్తున్న (17261) నెంబరు రైలును తిరుపతి నుంచి ధర్మవరం వరకు 2 నెలలపాటు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయించారు. అక్టోబరు 1 నుంచి నవంబరు 30వ తేదీ వరకు గుంటూరు నుంచి తిరుపతి వరకు వెళ్లే ఈ రైలు ధర్మవరం వరకు వెళ్తుంది. అలాగే అక్టోబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ధర్మవరం నుంచి తిరుపతి మీదుగా గుంటూరుకు ఈ రైలు 19 కోచ్‌లతో వెళ్తుంది. గుంటూరు నుంచి తిరుపతి వరకు పాత సమయాలలోనే ఈ రైలు తిరుగుతుందని, గుంటూరులో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరే ఈ రైలు గిద్దలూరు మీదుగా తిరుపతికి మరుసటి రోజు తెల్లవారుజామున 3.55 గంటలకు చేరి అక్కడి నుంచి పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి, కదిరి మీదుగా ఉదయం 9గంటలకు ధర్మవరం చేరుతుందని అధికారులు ప్రకటించారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ధర్మవరంలో మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి తిరుపతికి 7.15 గంటలకు చేరుతుందని, అక్కడి నుంచి రేణిగుంట, నంద్యాల, గిద్దలూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు గుంటూరు చేరుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



స్వచ్ఛతా హి సేవ సభలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం

● స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సాంఘికసంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం స్థానిక పాత జిల్లాపరిషత్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన సఫాయి మిత్ర సురక్షశివిర్ మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ రాజాబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌లతో కలిసి మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెడుతున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రమంలో ముందుగా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మునిసిపాలిటీల్లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులతో సమానంగా గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ కార్మికులు ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సేవల కోసం ఏ ఆస్పత్రికైనా, ఏ ప్రభుత్వ కార్యాలయానికైనా వెళ్లి గుర్తింపు కార్డుచూపిస్తే వీఐపీలకు ఇచ్చే గౌరవాన్ని పారిశుధ్య కార్మికులకు కూడా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్‌విజయకుమార్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు జీతాల చెల్లింపులో జాప్యంలేకుండా ప్రభుత్వం చూస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రిమ్స్, కిమ్స్, శ్రీరామ్, అస్టర్ రమేష్, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వైద్యులతో పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా క్లాప్‌మిత్రలు 1820 మంది, పారిశుధ్య కార్మికులు 1215 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈఎస్ బాలశంకరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

కొత్త టీచర్ల శిక్షణపై సమీక్ష

ఒంగోలు విద్య, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 3నుంచి ప్రారంభం కానున్న కొత్త టీచర్ల శిక్షణపై డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో డీఎస్సీ టీచర్ల పోస్టులకు ఎంపికైన వారు వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణకు హాజరుకావాలని కోరారు. ప్రతి శిక్షణ కేంద్రానికి పర్యవేక్షణకు ఒక ఎంఈవో, ఒక హెచ్‌ఎంను నియమించారు. శిక్షణకు హాజరయ్యే టీచర్లకు ఉదయాన్నే యోగాపై శిక్షణ ఇప్పించాలని, క్రమశిక్షణ కోసం ప్రతి శిక్షణ కేంద్రానికి ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లను నియమించారు. శుక్రవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులతో డీఈవో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

సమస్యల పరిష్కారం కోసం వైద్యుల ధర్నా

● రేపు చలో విజయవాడను విజయవంతం చేయాలని పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమస్యలను పరిష్కరించాలని పలువురు వైద్యాధికారులు డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్‌బాండ్ పదోన్నతులు అమలు చేయాలని తదితర డిమాండ్లతో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పలువురు అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బేసిక్ పే 30శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్ చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద రూ.5వేల అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 3వ తేదీన ఆయా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ఒనారియల్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ సుందర ప్రసాద్, డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రసూల్, డాక్టర్ చైతన్యదీప్ తదితరులు ఉన్నారు.



ధర్నా చేస్తున్న వైద్యులు

మందుబాబులకు పోలీసు ట్రీట్‌మెంట్!

● బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు ● ఫిర్యాదుల కోసం 112 టోల్‌ఫ్రీ నంబరు



శివారు కాలనీల్లో మద్యం సేవిస్తున్న వారితో శుభ్రం చేయిస్తున్న పోలీసులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంతోపాటు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మందుబాబులకు జిల్లా పోలీసులు ప్రత్యేక ట్రీట్మెంట్ ఇచ్చారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని వారితో పారిశుధ్య పనులు, వారు మద్యం సేవించిన ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలగింపు లాంటి పనులు చేయించారు. బుధవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 1034 మందిపై కేసులు నమోదు చేయగా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 293 ప్రదేశాలను గుర్తించి 265 ప్రదేశాలను శుభ్రం చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ మందు బాబులు అల్లర్లకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మీ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో వీడియో గానీ, ఫొటోలుగానీ తీసి 9121102266 నంబరుకు వాట్సాప్ చేయాలన్నారు. లేని పక్షంలో 112కు కాల్ చేయవచ్చని తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

గనులపై దృష్టి సారించాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు, సీనరేజ్ తదితరాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం గనులు, ఏపీ ఎండీసీ, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, రవాణా, ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని గనుల విస్తీర్ణం, వాటి రకాలు, లభిస్తున్న ఉపాధి, రవాణా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై ఆయా శాఖల అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత ఇదే సయానికి 18 శాతం వృద్ధి ఉన్నట్లు గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వం జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా నిర్దేశించినందున అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 12 స్టాక్ పాయింట్ల యార్డులలో 80వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ డాక్టర్లతో వైద్య సేవలు

● పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాట్లు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు ఆందోళనబాట పట్టడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది. జిల్లాలో 64 పీహెస్‌సీల పరిధిలో 138 మంది వైద్యాధికారులు పనిచేస్తుండగా వారిలో ఐదుగురు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వైద్యాధికారులందరూ సమ్మెబాటలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ముందుగా జిల్లాలో పరిస్థితిని గమనించిన కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఆయా పీహెచ్‌సీలకు ప్రత్నామ్నాయ వైద్యాధికారులను నియమించారు. వారందరూ బుధవారం 50 మంది విధుల్లో చేరాల్సి ఉండగా 42 మంది డాక్టర్లు వైద్య సేవలు అందించారు. ఇప్పటివరకు రోజువారీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు నాలుగువేలకుపైగా ఓపీలు వస్తుండగా బుధవారం కూడా సుమారు 3,500లకుపైగా ఓపీలు వచ్చాయి. మెడికల్ కాలేజీ నుంచి 50 మంది, కమ్యూనిటీ వైద్యశాల నుంచి 20 మంది వైద్యులను నియమించారు. జిల్లాలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల్లో కార్డుదారులకు బుధవారం రేషన్‌పంపిణీ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 1,392 రేషన్‌షాపుల పరిధిలో 6.61 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు బియ్యం, చెక్కర పంపిణీ ప్రారంభమయ్యాయి. కార్డుదారులకు ఆయా రేషన్‌షాపుల ద్వారా ఉదయం, సాయంత్రం సమయంలో కార్డుదారులకు పంపిణీ చేశారు. తొలిరోజు 20శాతం మంది కార్డుదారులు రేషన్ తీసుకున్నట్లు సమాచారం. దసరా పండుగ కావడంతో కొంతమంది కార్డుదారులు వారి స్వగ్రామాలకు వెళ్లడంతో కొంతమేర తీసుకున్నారు. శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ వేగంగా జరిగే అవకాశం ఉంది.


జిల్లా క్షయ నివారణాధికారిగా డాక్టర్ బాలాజీ



జిల్లా క్షయనివారణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాలాజీని సత్కరిస్తున్న ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్షయ నివారణ, లెప్రసీ ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ బాలాజీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న బాలాజీ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ రాజాబాబును, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లుతో పలు అంశాలపై చర్చించారు. క్షయ నియంత్రణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన బాలాజీని ఆ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
విజయ దశమి శుభాకాంక్షలు
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025





నెల్లూరు నగరంలో మహిషాసురమర్దిని అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

చెడుపై మంచి విజయమే దశమి

- నేడు దసరా పండుగ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెడుపై మంచి విజయం సాధించడానికి గుర్తుగా దేశ వ్యాప్తంగా ప్రజలు జరుపుకునే పండుగే విజయ దశమి. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణార్థం యుద్ధం చేసిన అమ్మవారు మహా నవమి నాడు మహిషాసుర సంహారం పూర్తి చేసిన సందర్భంగా దశమి నాడు లోకమంతా పండుగ చేసుకుంటుంది. జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజులు అమ్మవారిని రోజుకో రూపంలో కొలిచిన ప్రజలు విజయ దశమి సంబరాలకు సిద్ధమయ్యారు.

స్వాతంత్ర్య పోరాటంలోనూ..

దసరా ఉత్సవాలకు, దేశ స్వాతంత్ర్యోద్యమానికీ సంబంధం ఉంది. దుర్గాదేవిని విజయానికి ప్రతీకగా భావిస్తూ ఆంగ్లేయులపై పోరాటానికి స్ఫూర్తిగా దేవీ నవరాత్రి ఉత్సవాలను ఆనాడు దేశ ప్రజలు జరుపుకునేవారు. అలా విజయదశమి జాతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి ఊతమైంది. అంతకుముందు జమిందార్ల ఆధ్వర్యంలో మాత్రమే జరిగే ఈ ఉత్సవం 1919 నుంచి సామాజిక పండుగగా మారింది. 1930లో కలకత్తా మేయర్‌గా ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ సర్వజన పూజగా విజయ దశమిని ముందుండి నడిపించారు.

ఆలయాల్లో వేడుకలు

జిల్లాలోని ఆలయాలు విజయదశమి పండుగకు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. ఇప్పటికే దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతుండగా దసరా రోజు విశేష పూజలు, అర్చనలు, శమీ పూజ, పారువేట, నగరోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.



కలిగిరి : మహిషాసుర మర్దినిగా భద్రకాళి



చిత్రగుంట : మహిషాసుర మర్దినిగా రాజరాజేశ్వరి



ఉదయగిరిలోని శివాలయంలో మహిషాసుర మర్దినిగా పార్వతీదేవి



నెల్లూరులో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న నగరవాసులు



అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కన బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది.. నిబద్ధతతో పని చేయండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : : ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, నిబద్ధతతో పని చేయాలని మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన నూతన టీచర్లకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారికి నియామకపు పత్రాలు, జ్ఞాపికలు అందచేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రభుత్వం అందించిన కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయ కొలువులు సాధించటం అభినందనీయమంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ, స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ వంశీకిరణ్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు నెలలపాటు జరిగిన శిక్షణలో 300 మంది పాల్గొనగా, 20 మంది మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందారు.

34 గ్రామాల్లో 3 నుంచి రీ సర్వే

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 3 నుంచి 34 గ్రామాల్లో భూముల రీసర్వే కార్యక్రమం ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. భూములు కలిగిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ తమ భూముల హద్దులు రీ సర్వే బృందానికి చూపించి రికార్డులలో తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

7న గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఉలవపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఉలవపాడులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ అప్లికేషన్స్ పోస్టులకు గెస్ట్ అధ్యాపకులను నియమించేందుకు ఈనెల 7వ తేదీన కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది, ఆసక్తిగలవారు నేరుగా ఇంటర్వ్యూకు సంబంధిత తేదీన ఉదయం 10 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అభ్యర్థుల వయో పరిమితి, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. నెట్, సెట్, పీ హెచ్‌డీ అర్హతలున్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఏపీ మెగా డీఎస్సీ-2025 ద్వారా నియామకాలు చేపట్టడంతో నూతన ఉపాధ్యాయుల్లో ఆనందం మొదలైంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆనందం నింపుతూ జిల్లాలో 673 పోస్టులకుగాను 657 పోస్టులను భర్తీ చేశారు. వివిధ కారణాలతో 16 పోస్టుల బ్యాక్‌లాగ్‌లో ఉంచారు. ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ అందించి జిల్లాలో టీచర్లు లేని పాఠశాలలకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ ఏడాది జరిగిన బదిలీల్లో జిల్లాలో అత్యధిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో బదిలీ అయిన వారు కూడా పాత పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల డిప్యుటేషన్‌పై సమీప పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను కేటాయించి నడిపిస్తున్నారు. ప్రస్తుతం డీఎస్సీ నియామకాలు పూర్తవడంతో ఈ ఖాళీలన్నీ భర్తీ కానున్నాయి.

నూతన ఉపాధ్యాయుల్లో

సంబరం

- రేపటినుంచి అభ్యర్థులకు శిక్షణ
- బాధ్యతలు చేపట్టనున్న 657 మంది టీచర్లు



నెల్లూరు (విద్య), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 673 పోస్టులకు గాఉ 657 టీచర్ పోస్టులు భర్తీ చేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందచేశారు. అన్ని మేనేజ్‌మెంట్లలో భర్తీ చేసిన పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగం ఇంగ్లీష్ 83, హిందీ 18, తెలుగు 31, ఉర్దూ 5, బయాలజీ 62, మ్యాథ్స్ 64, ఫిజికల్ డైరెక్టర్లు 105, ఫిజికల్ సైన్స్ 75, సోషల్ 101 పోస్టులు భర్తీ అయ్యాయి. అలాగే ఎస్‌జీటీ తెలుగు 109, ఉర్దూ 4 పోస్టులు కలిపి 657 భర్తీ అయ్యాయి. అలాగే ఎస్ఏ ఇంగ్లీష్ 2, తెలుగు 1, ఉర్దూ 2, ఫిజికల్ డైరెక్టర్స్ 2, ఫిజికల్ సైన్స్ 1, సోషల్ 2, బయలాజికల్ సైన్స్ 1, హిందీ 1, ఎస్‌జీటీ తెలుగు 1, ఉర్దూ 3 పోస్టులు కలిపి మొత్తం 16 పోస్టులు క్యారీ ఫార్వర్డ్ ఖాళీలుగా మిగిలిపోయాయి. ఎంపికైన వారిలో తొలి ప్రాధాన్యతను ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ఇచ్చేలా, అన్ని ఖాళీలను చూపకుండా 1:1 నిష్పత్తిలో నూతన ఉపాధ్యాయులు ఎంతమంది ఉంటే అన్ని పోస్టులు కౌన్సెలింగ్‌లో చూపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

3 నుంచి ప్రత్యేక శిక్షణ

జిల్లాలో నూతన ఉపాధ్యాయులకు ఈ నెల 3 నుంచి 10వతేదీ వరకు ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. శిక్షణలో పాల్గొనే వారిలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ సబ్జెక్టుల అభ్యర్థులతో పాటు ఎస్‌జీటీ, ఎస్‌జీటీ ఉర్దూ మీడియం అభ్యర్థులు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో హాజరు కావాలన్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ టీచర్లు గొలగమూడిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో హాజరవ్వాలన్నారు. ప్రతి అభ్యర్థి ఈనెల 3వ తేదీన ఉదయం 7 గంటలకు విధిగా హాజరు కావాలని, అవసరమైన దుస్తులు, షూష్, దుప్పట్లు, లేటెస్ట్ ఆండ్రాయిన్ ఫోన్, మెడిసిన్, ఇతర అవసరాలకు సంబంధించినవన్నీ తీసుకురావాలని తెలిపారు.

చికెన్ ధరలు	
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100): 530	

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

లింగసముద్రం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవని లో వెలసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం తెల్లవారుజామున ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అలాగే స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం భక్తులకు గరుత్మంతుని పంప్రాదం గరుడ పొంగళి అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కావలి
కందుకూరు
ఆంధ్రజ్యోతి
గురువారం, 2 అక్టోబరు 2025
www.andhrajyothy.com

మహిషాసుర మర్దినిగా కలుగోళ శాంభవి

కావలి(టౌన్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం గ్రామదేవత కలుగోళ శాంభవి మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సింహ వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ మహాకాళి అలంకారంలో, కొత్తబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టు కున్నాయి. విష్ణాల యంలోని రాజ్యల క్ష్మికి వైభవలక్ష్మి అలంకారం, వడ్డిపాలెంలోని కనకదుర్గ అమ్మవారికి మహిషాసుర మర్దిని అలం కారం చేశారు. ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహిం చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తెల్లపాడులో భద్రకాళిగా...

కలిగిరి : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తెల్లపాడులో భద్రకాళి అమ్మవారు బుధవారం భక్తులకు మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. వేదపండితులు నారాయణం రమణ దీక్షితులు, శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత స్నపన అభిషేకములు, అష్టోత్తర, కుంకు మార్చన పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు అర్చన, దీపోత్స వం కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వర్లు పర్య వేక్షించారు.

● బోగోలు మండలంలో...

బిట్రగుంట : బోగోలు మండలంలో ని పలు ఆలయాల్లో శరన్నవరాత్రుల ప్రత్యేక పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి మహిషాసురమర్థిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బోగోలు షిరిడీ సాయి బాబా మందిరం, జ్ఞాన ప్రసునాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహిషాసురమర్థినిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

శ్రీవారికి రథోత్సవం, అశ్వవాహన సేవ

కావలి(టౌన్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బృందావనం కాలనీలో వెలసివున్న వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం శ్రీవారికి ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహన ఉత్సవ సేవలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో టీటీడీ ఆచారపు వ్యవహారాలతో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ముందు మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శ్రీవారి వాహన ఉత్సవాలకు భక్తులు అడుగడునా బ్రహ్మ రథం పట్టి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం చక్రస్నానం, ధ్వజారోహణ పూజలు జరగనున్నాయి.



రథోత్సవంలో శ్రీవారు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

● ఆధునిక టాయ్‌లెట్ బ్లాక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుం టేనే ఆరోగ్యాలు బాగుంటాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని రైతుబజారు వద్ద రూ.13.28 లక్షల స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో నూతనంగా నిర్మించిన ఆధునిక టాయ్‌లెట్స్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండటం తోపాటు గ్రామీణ ప్రజలు అధికంగా సంచరిం చే ప్రాంతంలో పబ్లిక్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి అన్ని సౌకర్యా లతో వీటిని నిర్మించామన్నారు. పబ్లిక్ టాయ్ లెట్స్ వినియోగించుకునేలా వ్యాపారులు ప్రజ లకు అవగాహన కల్పించటం ద్వారా పరిసరా లు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. రోడ్ల విస్తర ణలో భాగంగా షాపులు కోల్పోయిన చిన్న వ్యాపారుల కోసం త్వరలో పట్టణంలో స్మార్ట్‌బజారు ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే చేతులమీదుగా శానిటైజేషన్ కిట్లు పంపిణీ చేశారు. పట్టణం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ అందుకను గుణంగా పారిశుధ్య కార్మికులను పెంచేందుకు గత పాలకులు ఏమాత్రం శ్రద్ధ చూపలేదని పట్టణ విస్తరణకు తగ్గట్లుగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని 21వ వార్డు పడమటి మంగళిపాలెంలో బుధవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, డీఈ గణపతి, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, జీ.మోషే, వడ్డెళ్ల రవిచంద్ర, షేక్ రఫీ, పాల్గొన్నారు.



రైతుబజారు వద్ద టాయ్‌లెట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● చిరువ్యాపారులకు డ్వాక్రా రుణాలు

పట్టణంలో చిరువ్యాపారులు, పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం డ్వాక్రా రుణాలు మంజూరును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన లోక్ కళ్యాణ్ మేళాలో ఆయన పాల్గొని డ్వాక్రా రుణాలు అందించే మెప్మా సిబ్బందికి ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు మంజూరులో డిజిటల్ టెక్నాలజీని వినియోగించటం ద్వారా పని సరళతరం కావటంతో పాటు పారదర్శకత పెరుగుతుందన్నారు.

జీఎస్టీ తగ్గింపు రైతులకు వరం : ఏడీఏ

కావలి రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు నిర్ణయం రైతులకు వరమని వ్యవసాయశాఖ ఏడీఏ నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పించేందుకు సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఊరట కలిగించే విధంగా ట్రాక్టర్ల పనిముట్లు, వ్యవసాయ పనిముట్లు, ఆక్వా రైతులు వినియోగించే పరికరాలపై జీఎస్టీ తగ్గించటం హర్షణీయమన్నారు. ఏవో లలిత మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఉపమోగించే వస్తువులు, పనిముట్లపై గతంలో ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతంకు తగ్గించడంతో రైతులకు 7 శాతం ఆదా అయ్యిందన్నారు. అనంతరం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.



కావలిలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

● వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడం వలన రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఏవో శేషారెడ్డి తెలిపారు. వలేటివారిపాలెంలో బుధవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో బాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలైన ట్రాక్టర్, టైర్స్, విడిభాగాలు, బయోపెస్టిసైడ్స్, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు తదితర పరికరాలపై 12 నుంచి 5 శాతంకు తగ్గినట్లు తెలిపారు. ఫలితంగా వీటిపై రైతులకు అన్ని పరికరాలపై భారీగా ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు గుత్తా మహేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు వలేటి నరసింహం, నాయకులు శనివారపు మాల్యాద్రి, మార్తాల సుబ్బారెడ్డి, గుత్తా కొండయ్య, వలేటి మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వలేటివారిపాలెంలో జీఎస్టీ తగ్గింపుతో రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ఏవో శేషారెడ్డి

దోమల నివారణకు చర్యలు

వలేటివారిపాలెం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం పంచాయతీలో మూడు రోజులుగా దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుధ్యం పడకేసింది. దీంతో సీజనల్ జ్వరాలు ప్రారంభమయ్యాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని వైరల్ జ్వరాలు విజృంభించకముందే సర్పంచు సాధు శ్రీలత దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, వడ్డెపాలెం, బండివారిపాలెం, గాంధీనగర్, మంగళపాలెం చిన్నపాలెం పెద్దబజారు, జెండాచెట్టువీధుల్లో దోమల నివారణకు ఫాగంగ్ చేయించారు.



వలేటివారిపాలెంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

నేతల విజయదశమి శుభాకాంక్షలు

కందుకూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు వేర్వేరు ప్రకటనల్లో విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవరావు, మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి, వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ తదితరులు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, అమ్మవారి కృపతో ప్రజలందరి జీవితాల్లో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, విజయాలు నిండాలని ఆకాంక్షించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి గాయాలు

● క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. భీమవరం చెరువు వద్ద బుధవారం ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ అంకమ్మ తెలిపిన వివరాల మేరకు.. భీమవరంలో టీడీపీ నాయకుడు జాజుల రవి కుమార్తె వివాహానికి చాకిచర్లకు చెందిన నాయకులు మల్లికార్జున, భాస్కర్ బైక్‌పై బయలుదేరారు. భీమవరం గ్రామానికి చెందిన శేషయ్య తన ఇద్దరి కుమార్తెలు దివ్య, దీపికలతో బైక్‌పై రాజుపాలెం వైపు వెళ్తున్న క్రమంలో చెరువు మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు బైక్‌లపై ఉన్న ఐదుగురుకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కాగా అదే భీమవరం గ్రామంలోని పార్టీ నాయకుడి కుమార్తె వివాహానికి వెళుతున్న స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి విషయం తెలియడంతో ఉలవపాడు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

పింఛన్ల పంపిణీ

వలేటివారిపాలెం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. మండలంలోని పోకూ రు, నూకవరం, శాఖవరం గ్రామాల్లో బుధవారం సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణాలు కాపాడే పవిత్ర కార్యం

కావలి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణాలను కాపాడే పవిత్ర కార్యమని డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానాన్ని ప్రోత్సహించే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం రక్తం కోసం నడక (వాక్ ఫర్ బ్లడ్) కార్యక్రమాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఐఎంఏ, రోటరీక్లబ్, టీంసేవియర్స్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం, అభయం, జనవిజ్ఞాన వేదిక, వాసవీ వనితాక్లబ్, పవన్‌కల్యాణ్ అభిమాన సంఘం, శ్రీలక్ష్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్, సంయుక్త సేవా సంస్థ, ఎన్‌సీసీ నావెల్ యూనిట్, భగత్‌సింగ్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ బ్యానర్లను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ టీపీఎస్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనం వరకు కొనసాగింది. రెడ్‌క్రాస్ భవనంలో డాక్టర్ జయగోపాల్ జోలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ రవిప్రకాష్, డాక్టర్ పాములూరు శ్రీధర్, డాక్టర్ నళినీ పద్మ, డాక్టర్ కే. మాధవరెడ్డి, రెడ్‌క్రాస్ బాధ్యులు పాల్గొన్నారు.

30 పోలీస్ యాక్టు మరో నెల పొడిగింపు

కందుకూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో 30 పోలీసు యాక్టును మరో నెలరోజులు పొడిగిస్తూ డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా కొన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు ఆందోళనలకు సిద్ధపడుతున్నాయన్న సమాచారం ఉన్నందున పరిస్థితులను చక్కదిద్దేందుకు 30 పోలీసు యాక్టును అక్టోబరు 31వరకు పొడిగించారు. పోలీసు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పట్టుబడిన పేకాటరాయుళ్లు

ఉలవపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దిపూడిలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో స్థానిక ఎస్‌ఐ అంకమ్మ తన సిబ్బంతో కలిసి మంగళవారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7,130 స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కలిగిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెంలో స్వర్ణ వందనం కుమారుడు స్వర్ణ డేవిడ్ 50వ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతోపాటు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్, వెంకన్నపాలెం గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.